ప్రజాశక్తి

బుధవారం 11 డిసెంబర్ 2024

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

గులాబీ వనంలో..

గుర్రపు డెక్కల చప్పుడా ?

- కొండవాలు ప్రాంత ప్రజావసరాలు మరిచి రూ.6 కోట్ల ప్రజాధనం వృథా చేస్తారా ?
- నేడు జివిఎంసి సర్వసభ్య సమావేశం



ముడసర్లోవ చెంత హార్స్ రైడింగ్ ప్రాజెక్టు కోసం తలపెట్టిన నిర్మాణాలు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ప్రజాధనాన్ని వృథా చేయడంలో మహా విశాఖ నగర పాలక సంస్థ (జివిఎంసి) పాలకుల తీరే వేరంటే నమ్మాలి మరి. ప్రజల అవసరాలకు తగ్గ పనులు ఎక్కడెక్కడ చేపట్టాలన్న ప్రాధాన్యాన్ని వారు విస్మరించడం తరుచూ కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. ప్రజా అవసరాలకు తగ్గ ప్రణాళికలు కాకుండా ఎవరో కొందరి భోగ తృప్తుల కోసం తాపత్రయ పడుతున్న ధోరణి గతం నుంచీ కొనసాగుతోంది. ఆ కోవలోకి వచ్చే వ్యవహారమే ఇది. నగరంలోని ముడసర్లోవ పార్కు సమీపంలోని 3 ఎకరాల గులాబీ వనంలో రూ.6 కోట్లతో గుర్రాల పార్కు (హార్స్ రైడింగ్ ప్రాజెక్టు) కోసం గతంలో పనిచేసిన కమిషనర్ సారథ్యంలో మేయర్ గొలగాని హరివెంకటకుమారి చొరవతో ఇప్పటికే ముందస్తు ఆమోదం ఇచ్చేశారు. ఇది జివిఎంసికి ఆర్థిక భారం కానుందన్న విషయాన్ని సైతం ఏ మాత్రమూ పట్టించుకోలేదు. దీనికోసం ఇప్పటివరకూ రూ.3 కోట్లు ఖర్చుచేశారు. మిగతా రూ.3 కోట్లును ఖర్చుచేసేందుకు బుధవారం జరుగనున్న జివిఎంసి సర్వసభ్య సమావేశంలో రాటిఫికేషన్ కోసం పెడుతుండడంపై సర్వత్రా చర్చ జరుగుతోంది.

ప్రజల మౌలిక వసతులు మరచి..

ముడసర్లోవ సమీపాన ఉన్న 9, 10, 11, 12, 13 వార్డులు కొండవాలు ప్రాంతాలుగా మిగతా 2లో..

ఏరివేతకేనా..?

- నిర్దేశిత ప్రాంతాల్లో పింఛన్లను తనిఖీ చేస్తున్న సర్వే బృందాలు
- నొక్కి నొక్కి ప్రశ్నలు వేస్తుండటంతో లబ్ధిదారుల్లో ఆందోళన



పురుషోత్తపురంలో పెన్షన్ల వెరిఫికేషన్ చేస్తున్న అదికారులు

ప్రజాశక్తి - యలమంచిలి, విశాఖ కలెక్టరేట్ విలేకరులు

రాష్ట్ర ప్రభుత్వం సామాజిక పింఛన్ల తనిఖీకి శ్రీకారం చుట్టిన నేపథ్యంలో విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో నిర్దేశించిన సచివాలయాల్లో మంగళవారం సర్వే బృందాలు రంగంలోకి దిగాయి. పింఛన్ల పంపిణీలో జరుగుతున్న అవకతవకలను వెలికితీయడానికే ఈ సర్వే అని ప్రభుత్వం బయటకు చెబుతున్నా పింఛన్ల ఏరివేతకే అన్న విషయం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది.

అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశాలతో యలమంచిలి మండలంలోని పురుషోత్తపురం సచివాలయ పరిధి కొత్తలి, మెట్టపాలెం గ్రామాల్లోని పెన్షన్ కార్డులను సర్వే బృందాల అధికారులు మంగళవారం తనిఖీ చేశారు. థర్డ్ పార్టీ ఉద్యోగులు ఇద్దరేసి సభ్యుల చొప్పున 10 టీములుగా ఏర్పడి ఉదయం నుండి ఈ తనిఖీలు చేపట్టారు. పురుషోత్తపురం, కొత్తలి, మెట్టపాలెం గ్రామాల్లో మొత్తం అన్ని రకాల పెన్షన్‌దారులు 491 మంది ఉన్నారు. వీరి వివరాలను ప్రత్యేక యాప్‌లో సర్వే బృందాలు నమోదు చేశాయి. పెన్షన్‌దారుల ఆధార్, తెల్ల రేషన్‌కార్డు, వికలాంగుల సదరం సర్టిఫికెట్, వితంతు పెన్షన్‌దారుల భర్త డెత్ సర్టిఫికెట్, ఒంటరి మహిళల ఫ్యామిలీ సర్టిఫికెట్ మొదలైన ఆధారాలను పరిశీలించి యాప్‌లో నిక్షిప్తం చేసుకున్నారు. డిఆర్‌డిఎ పీడీ సచీదేవి, డిఐడిఒ మంజులావాణి ఆయా గ్రామాల్లో పర్యటించారు. వారి వెంట ఎంపిడిఒ కొండలరావు, సూపరింటెండెంట్ ప్రసాదరావు ఉన్నారు. మూడు గ్రామాల్లో ఒక్కరోజులోనే సర్వే పూర్తయిందని, ఎవరు అర్హుల్లో, ఎవరు కాదో అన్నది వారిచ్చిన మిగతా 2లో..

పోర్టు ప్రగతిలో పిఎస్‌యులు కీలకపాత్ర

వార్త 2లో..

ప్రపంచ వ్యాప్తంగా మానవ హక్కుల ఉల్లంఘన

వార్త 5లో..

14న జాతీయ లోక్ అదాలత్

వార్త 3లో..



డ్యాన్స్‌లతో అలరించిన విద్యార్థులు

ఘనంగా ఎస్‌ఎఫ్‌ఐ కల్చరల్ ఫెస్ట్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఎస్‌ఎఫ్‌ఐ ఆంధ్రా యూనివర్సిటీ కమిటీ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు తలపెట్టిన కల్చరల్ ఫెస్ట్ మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. ఎయు రిజిస్ట్రార్ ఇఎన్.ధనుంజయరావు వర్సిటీ ఓపెన్ ఆడిటోరియంలో ఈ ఫెస్ట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌ఎఫ్‌ఐ ఇలాంటి ఫెస్టులు నిర్వహించడం అభినందనీయమన్నారు. విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను వెలికి తీయడానికి ఇలాంటివి దోహదపడతాయని తెలిపారు. విద్యార్థులు ఇలాంటి కార్యక్రమాల్లో మరింత ఉత్సాహంగా పాల్గొనాలని ఆకాంక్షించారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ఎంవి.రాజు మాట్లాడుతూ ఫెస్ట్ విజయవంతం కావాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ యూనివర్సిటీ కమిటీ కార్యదర్శి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. తొలి రోజు జరిగిన సాంస్కృతిక ప్రదర్శనల్లో 200 మంది భాగస్వాములయ్యారు. విద్యార్థుల కళారూపాలు ఆహూతులను కట్టిపడేశాయి.

కీలక ప్రాజెక్టులకు విఎంఆర్‌డిఎ ఆమోదముద్ర

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విఎంఆర్‌డిఎ అథారిటీ సమావేశం మంగళవారం సాయంత్రం సిరిపురంలోని విఎంఆర్‌డిఎ కార్యాలయంలో జరిగింది. సమావేశ అనంతరం ఛైర్మన్ వి.ప్రణవ్ గోపాల్, మెట్రోపాలిటన్ కమిషనర్ కెఎస్.విశ్వనాథన్ సమావేశానికి సంబంధించిన వివరాలను మీడియాకు తెలియజేశారు. యలమంచిలి, నర్సీపట్నం మున్సిపాలిటీల్లో, నెల్లిమర్ల గ్రామ పంచాయతీలో మౌలిక వసతులు, పలు అభివృద్ధి పనులు చేపట్టడానికి నిర్ణయం తీసుకున్నామన్నారు. అందుకు సుమారు రూ. 9 కోట్లు కేటాయించినట్టు తెలిపారు. సుమారు రూ.200 కోట్ల వ్యయంతో కేంద్ర ప్రభుత్వం, విఎంఆర్‌డిఎ 90:10 నిష్పత్తిలో చేపట్టే కోస్టల్ ఎరోసిన్ ప్రాజెక్టుకు, మధురవాడ వద్ద ఒలింపిక్ స్టాండర్డ్‌కు అనుగుణంగా 2.7 ఎకరాల్లో క్రీడా సముదాయం నిర్మాణానికి, రుషికొండ ప్రాంతంలో పిపిపి విధానంలో అంతర్జాతీయ ప్రమాణాలతో హ్యాబిటేట్ సెంటర్ నిర్మాణానికి, రుషికొండ, గంభీరం వద్ద యువత కోసం వాటర్ స్పోర్ట్స్ ప్రాజెక్టుకు, అనకాపల్లి దగ్గర 7.68 ఎకరాలలో హెల్త్ సిటీ నిర్మాణానికి నిర్ణయం తీసుకున్నామన్నారు.

లోన్ యాప్ వేధింపులకు యువకుడు బలి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నగరంలో మరో దారుణం చోటు చేసుకుంది. లోన్ యాప్ వేధింపులకు మరో యువకుడు బలైపోయాడు. పెళ్లైన 40 రోజులకే అతడు ఆత్మహత్య చేసుకోవడం తీవ్ర విషాదం నింపింది. వాట్సాప్‌లో మార్ఫింగ్ చేసిన ఫొటోను చూసి కలత చెందిన సదరు యువకుడు ప్రాణాలు తీసుకున్నాడు. వివరాల్లోకి వెళితే.. మహారాణిపేట అంగటిదిబ్బ ప్రాంతానికి చెందిన నరేంద్ర (22)కు అక్టోబర్ 20న వివాహమైంది. ఆయన ఓ లోన్ యాప్ నుంచి రెండు వేల రూపాయల రుణం తీసుకున్నాడు. దాన్ని సకాలంలో చెల్లించలేదని లోన్ యాప్ గ్యాంగ్ నరేంద్ర ఫొటోను అసభ్యకరంగా మార్ఫింగ్ చేసి బెదిరింపులకు దిగింది. అక్కడితో ఆగకుండా ఆ ఫొటోను ఆయన భార్యకు, స్నేహితులకు, బంధువులకు లోన్ యాప్ నిర్వాహకులు వాట్సాప్ ద్వారా పంపారు. దీంతో నరేంద్ర తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనపై ఎంఆర్.పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నగరంలో పోలీసు బదిలీలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం పోలీస్ కమిషనరేట్ పరిధిలో వివిధ పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్న 25 మంది సిబ్బందిని సాధారణ బదిలీలలో భాగంగా వివిధ స్టేషన్లకు బదిలీ చేస్తూ నగర పోలీస్ కమిషనర్ శంకబ్రత బాగ్చి మంగళవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు వీరిలో నలుగురు ఎస్‌ఐలు, ఒక ఉమెన్ ఎఎస్‌ఐ, 9 మంది హెడ్ కానిస్టేబుళ్లు, ఒక ఉమెన్ హెడ్ కానిస్టేబుల్, ఏడుగురు పోలీస్ కానిస్టేబుళ్లు, ముగ్గురు ఉమెన్ పోలీస్ కానిస్టేబుళ్లు ఉన్నారు. ఈ బదిలీలు వెంటనే అమల్లోకి వస్తాయని, బదిలీ అయిన సిబ్బంది వెంటనే తమ తమ స్థానాల్లో రిపోర్ట్ చేయాలని కమిషనర్ తన ఉత్తర్వులలో పేర్కొన్నారు.

బదిలీ అయిన వారు వీరే..

ఎఎస్‌ఐలు టి.జోగారావు, బిసిహెచ్.నాయుడు. మిగతా 2లో..

పోర్టు ప్రగతిలో పిఎస్‌యులు కీలకపాత్ర

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో



మాట్లాడుతున్న అంగముత్తు

విశాఖ పోర్టు ప్రగతిలో పిఎస్‌యుల పాత్ర మరువలేనిదని పోర్టు ఛైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు అన్నారు. పోర్ట్ భాగస్వాములు, రాష్ట్ర, జిల్లా అధికారులు, రైల్వేలు, కస్టమ్స్, ఎన్‌హెచ్‌ఎఐ వంటి పిఎస్‌యుల అమూల్యమైన సహకారాన్ని ఆయన ప్రశంసించారు. పోర్టు వివిధ రికార్డులను తిరగరాస్తున్న నేపథ్యంలో పోర్టు భాగస్వాముల సమావేశాన్ని మంగళవారం హోటల్ రాడిసన్ బ్లూలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖపట్నం పోర్టు అథారిటీ 2024-25 ఆర్థిక సంవత్సరానికి 90 మిలియన్ మెట్రిక్ టన్నుల సరుకు నిర్వహణా లక్ష్యంతో నిరంతరం శ్రమిస్తూ విశేషమైన పురోగతి సాధిస్తోందన్నారు. అందులో భాగంగా 249 రోజులలోనే 55 ఎంఎంటి సరుకు నిర్వహణ చేయడం ద్వారా గత చరిత్రను తిరగరాసిందన్నారు. స్వర్ణాంధ్రప్రదేశ్ లక్ష్యాలకు అనుగుణంగా పోర్టు ఆధారిత అభివృద్ధికి కట్టుబడి ఉన్నామన్నారు. సమావేశంలో విశాఖ జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, జివిఎంసి కమిషనర్ డాక్టర్ సంపత్ కుమార్, హిందూస్థాన్ షిప్ యార్డ్ లిమిటెడ్ సిఎమ్‌డి హేమంత్ కత్రి, కస్టమ్స్ అండ్ జిఎస్‌టి ప్రధాన కమిషనర్ నరసింహ శ్రీధర్, జికె.ధాల్, టి.వేణు గోపాల్ పాల్గొన్నారు.

IN THE HON'BLE COURT OF THE 1st ADDITIONAL DISTRICT JUDGE CUM MSJ AT : VISAKHAPATNAM
CRL M.P NO. 86/2022 IN CC NO.1/2008 AND CC NO. 2/2008

Between :
KANDRAKONDA BRAHMAIAH S/o. Guravaiah R/o H.No. 45-36-4 flat no.402, Ganga Residency Apartments, Jagannadhpuram, Akkayyapalem, Visakhapatnam -530016.
...Claim Petitioner

And:
To,
R-1: Vommi Rama Murthy Chits and investments Pvt. Ltd, D.No. 36-46-37, Kancharapalem, Visakhaptanam- 8 Rep by Vommi Srinivasarao Managing Director,
R-2 : Vommi Rama Murthy Educational Society, D.No. 36-46-37, Kancharapalem, Visakhaptanam- 8 Rep. by its Director, Vommi Ramanarayana
R-3 : Vommi Rama Murthy Medical & Aronatical, Plantations, D.No.36-46-37 Kancharapalem, Visakhapatnam, Rep. by its Director, Vommi Madhusudanarao
R-4 : Vommi Rama Murthy, Agro Farms & Houses (Un Registered) D.No. 36-46-37, kancharapalem, Visakhapatnam, Rep by Vommi Srinivasarao, Vommi, Madhusudanarao, V. Ramanarayana, B.V. Ramesh Chandra, V. Krishnarao, A. Anasuyamma and V. Srivishnu.
R-5 : Vishnu InfoTech (Un Registered) D.No. 36-46-37, Kancharapalem, Visakhapatnam-8, Rep by Rep by Vommi Srinivasara o, Vommi, Madhusudanarao, V.Ramanarayana, B.V.Ramesh Chandra, V.Krishnarao, A. Anasuyamma and V. Srivishnu.
R-6 : Vommi Madhu Sudhanarao S/o late Rama Murthy Secretary & Correspondent, in VR Educational Society, Ex. MD of VR Chits & Investments Pvt Ltd, Director of VR Medicals & Auro natical Plantations, Partner of VR Agro Farms & Houses and Vishnu Infotech. D.No. 36-46-37, Kancharapalem, Visakhapatnam-8.
R-7 : Vommi Srinivasarao S/o late Rama Chandrarao, M.D. VR Chits & Investments Pvt Ltd, Partner of VR Agro Farms & Houses and Vishnu InfoTech, D.No. 36-46-37, Kancharapalem, Visakhapatnam-8. R/o D.no 56-1-69 Kancharapalem, Visakhapatnam-8
R-8 : Vommi Rama Narayana S/o Madhusudhanarao Chairman of VR Chits & Investments Pvt Ltd, Partner of V.R. Agro Farms & Houses and Vishnu InfoTech. D.No. 36-46-37, Kancharapalem, Visakhapatnam-8
R-9 : B.V.Ramesh Chandra, Director, VR Chits & Investments Pvt Ltd, Partner of VR Agro Farms & Houses and Vishnu Info Tech, D.No.36-46-37, Kancharap -alem, Visakhapatnam -8, R/o D.No.56-1-69, Kancharapalem, Visakhapatnam.
R-10 : Vommi Krishnarao, S/o late Ramana Murthy Partner of VR Agro Farms & Houses and Vishnu Infotech, D.No. 36-46-37, Kancharapalem, Visakhapatnam-8. R/o D.No.56-1-69, Kancharapalem, Visakhapatnam.
R-11 : Vommi Anasuyamma, D/o Rama Murthy, Partner of VR Agro Farms & Houses and Vishnu Infotech, D.No. 36-46-37, Kancharapalem, Visakhapatnam-8. R/o D.no.56-1-69, Kancharapalem, Visakhapatnam.
R-12 : Vommi Sri Vishnu D/o Madusudhanarao, Partner of VR Agro Farms & Houses and Vishnu Infotech, R./o 56-1-69, Kancharapalem, Visakhapatnam
...A1 to A12/Respondents

NOTICE

Please take notice in the above petitioner filed by the claim petition against you for recovery of a sum of Rs.3,50,000/- (three lakhs fifty thousend only) intrest from 09-01-2005 thereone and costs As per High Court Orders. The said matter stands posted to **03-01-2025,** therefore you are required to attend before the Honour arble Court **at 10.30 A.M** on **03-01-2025** in person or through your agent or Advocate failing which you will be set ex-parte and the mater will be decidead on merits in your absence in favoure of the Claim Petitioner.

PEDADA SURIBABU
Advocate, Visakhapatnam
Cell : 9848258375

మహారాజశ్రీ కొత్తపేట సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
O.S.No. 24/2023

Between:
నల్లి శివాజీ, వయసు 65 సం॥లు S/o. భీమారావు, హిందూ, Retired Employeee, D.No.2-252/1, పంచాయితీ రోడ్డు, పి.గన్నవరం, పి.గన్నవరం మండలం, డా॥బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా **...వాది**

And

దడాల బాస్కరరావు,D.No.2-29, వయసు 58 సం॥లు,S/o. అప్పారావు, హిందూ, బిజినెస్, లక్ష్మీవానిపాలెం, పోతినమల్లయపాలెం, విశాఖపట్నం-530041,AP. **...ప్రతివాది**

పై నెంబరు దావాలో ప్రతివాదికి ఎన్నిసార్లు దావా సమన్లు పంపించిననూ, త్రిప్పివేయుచున్నారు. పై నెంబరు దావా ది.**20-12-2024**న వాయిదా అయివున్నది. కావున ప్రతివాది పై కోర్టు నందు పై తేదీన ఉదయం **10.30** గం॥లకు స్వయంగా గాని ప్లీడరు గారి ద్వారా గాని హాజరై మీవాదన తెలియజేసుకొనవలెను. లేనిచో మీ పరోక్షమున తీర్మానం తెలియజేయబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

K.Rajeev
Advocate, Kothapeta
Cell.9849678555
కొత్తపేట
10-12-2024

IN THE HON'BLE COURT OF THE 1st ADDITIONAL DISTRICT JUDGE AT : VISAKHAPATNAM
EP No. 35/2023 in OS No. 376/2010

Between :
Smt DADISETTI SUNEETHA ...DHR/Petitioner
And
GUDLA ANJANEYA Reddy & Another ...Jdrs/Defendents
To
Jdr-1 : Gudla, Anjaneyareddy S/o late Suri Reddy, R/o D.No: 53-11-16/1, first floor Ramalayam Veedhi, Maddila palem, Visakhapatnam.
Jdr No-2 : Gudla Venkata Ramachandra Reddy S/o late Suri Reddy "Rest do"

NOTICE

Please take notice that the above DHR/ Petitioner filed above EP against you and anotherfor Recovery of a sum of Rs. 38,35,893/- (Rupees thirtyeight lakhs thirty five thousend eight hundred ninety three only) along with intrest thereon and costs. The said matter stands posted to **26-12-2024,** therefore you are required to attend before the above mentioned Hon`ble court **at 10.30 AM** on **26-12-2024** in person or through your agent or advocate failing which you will be set ex-parte and the matter will be decided on merits in your Absence in favour of the dhr/plaintiff

PEDADA SURIBABU
Advocate, Visakhapatnam
Cell : 9848258375
Visakhapatnam
Dt. 07-12-2024

IN THE HON'BLE COURT OF THE I ADDL. CIVIL JUDGE (SENIOR DIVISION) AT: VISAKHAPATNAM
E.A.74/2024 in E.P. 236/2019 in O.S.308/2015

Between:
Kolli Satyavathi ...Claim Petitioner
And:
1)Gonnabothula Amirishwara Rao . . . (D.Hr)
2) Bayana Srinivasa Rao...(J.Dr)
...Respondents

NOTICE

To,
R-2:Sri Bayana Srinivasa Rao, S/o. Venkanna, D.No.25-43 & 25-42,RTC Colony, Nagarapalem Road, Madhurawada, Visakhapatnam

Please take notice that the above numbered E.A.74/2024 in E.P.236/2019 in O.S.308/2015 filed by the Claim Petitioner stands posted to **31-12-2024** for your appearance before the Hon'ble I Addl. Civil Judge (Senior Division) at Visakhapatnam. Therefore, you are hereby called upon to appear either in person or through an Advocate before the Hon'ble Court on **31st day of December 2024** at **10:30 A.M.,**and default of your appearance on that day and hour mentioned, the above E.A. will be heard ex-parte in your absence and proceed further in a accordance with law.

C.S. SEKHAR,
Advocate, Ram Nagar, Visakhapatnam.
Cell: 9948116888.

మొదటి పేజీ తరువాయి..

గులాబీ వనంలో... గుర్రపు డెక్కల చప్పుడా ?

ఉన్నాయి. రిటైనింగ్ వాల్స్ కట్టాలన్నది అక్కడి ప్రజల డిమాండ్. ఆ విషయాన్ని పక్కనపెట్టి ప్రజాధనాన్ని వృథా చేయడం విస్మయంగొలుపుతోంది. గుర్రపు డెక్కల చప్పుళ్లతో మూడు ఎకరాల గులాబీల వనాన్ని నిర్వీర్యం చేయడం విచారకరం. స్మార్ట్ సిటీ అభివృద్ధిలో భాగంగా ఈ హార్స్ రైడింగ్ ప్రాజెక్టు అని చెబుతున్నా 'స్మార్ట్' పరిధిలోలేని ఏరియాలో రూ.6 కోట్లను ఎలా ఖర్చుచేస్తారన్న ప్రశ్న పలువురిలో తలెత్తుతోంది. నగరంలో గతంలో నిర్ణయించిన 1500 ఎకరాలు అంటే.. పాండురంగాపురం నుంచి సిరిపురం వరకూ మాత్రమే స్మార్ట్ సిటీ పనులు జరిగాయి. 'మిగతా ముడసర్లోవ ప్రాంతానికి స్మార్ట్ సిటీ పనులను ఎక్కడ విస్తరించారు. ముడసర్లోవ వరకూ విస్తరిస్తే ఎక్కడ, ఎవరి ఆమోదం తీసుకున్నారు. కౌన్సిల్‌నుగానీ, ప్రజాప్రతినిధులనుగానీ దీనికి సంబంధించిన నిర్ణయాల్లో ఎప్పుడైనా భాగస్వామ్యం చేశారా ?' అంటే పాలకులు తెల్లముఖం వేస్తున్నారు.

ఎన్నికైన ప్రజాప్రతినిధుల స్పెషల్ ఫండ్స్ ఏమైనా ఉన్నాయా?

హార్స్ రైడింగ్ ప్రాజెక్టు కోసం ఎంపీలు నిధులిచ్చినా లేదంటే ఎంఎల్‌ఎలు ప్రత్యేక నిధులను ప్రభుత్వం నుంచి తీసుకొచ్చినా ఎవరికీ అభ్యంతరం ఉండదని, ప్రజల నుంచి పన్నుల రూపంలో వసూలు చేసిన ధనాన్ని ఈ ప్రాజెక్టు కోసం ఉపయోగించడం తీవ్ర అభ్యంతరకరమని పలువురు మండిపడుతున్నారు. 'ఈ ప్రాజెక్టు విషయంలో జివిఎంసికి విచక్షణ లేదా?' అంటూ అధికారులే ప్రశ్నిస్తున్నారు. గతంలో జివిఎంసి కమిషనర్‌గా పనిచేసిన ఎస్‌పి.సింగ్ అనే అధికారి ముడసర్లోవ పార్కు పరిసరాల్లో మూడు ఎకరాలను గులాబీల పార్కు కోసం కేటాయించారు.

దీన్ని ఇప్పటికీ పాత గులాబీ గార్డెన్ అని నగరంలో పిలుస్తారు. దాని విధ్వంసానికి నేడు ప్రణాళికలు రచిస్తున్నారు. ఇప్పటికైనా జివిఎంసి ప్రజాప్రతినిధులంతా సంస్థకు గుదిబండ, తెల్ల ఏనుగులా మారే గుర్రాల పార్క్ వ్యవహారం కౌన్సిల్‌లో చర్చకు వచ్చినప్పుడు నిలుపుదల చేయాలన్న డిమాండ్ ప్రజల నుంచి వినిపిస్తోంది.

ఏరివేతకేనా..?

ఆధారాల ప్రకారం త్వరలోనే తెలుస్తుందని ఎంపిడిఒ తెలిపారు.

ఇందిరా నగర్‌లో...

సామాజిక పింఛన్ల తనిఖీ కార్యక్రమాన్ని విశాఖ నగరంలోని జోన్ 5 పరిధిలో ఉన్న కంచరపాలెం ఇందిరా నగర్‌లో ప్రత్యేక అధికారుల బృందం చేపట్టింది. ఇందిరా నగర్ 1, 2, 3, 4, 5 వీధులు ఉండగా సోమ, మంగళవారాల్లో రెండు వీధులలో తనిఖీలు నిర్వహించారు. ఈ ప్రాంతంలోని వార్డు సచివాలయాలకు చెందిన అధికారులు కాకుండా, పొరుగు వార్డులకు చెందిన సచివాలయ కార్యదర్శి, మరి కొంతమంది సిబ్బందితో కలిపి పింఛన్ల సర్వే కార్యక్రమాన్ని పైలట్ ప్రాజెక్టుగా చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ఒక గెజిటెడ్ అధికారి స్వయంగా పర్యవేక్షించారు. సోమవారం జరిగిన తనిఖీలో 265 మంది పింఛన్లను తనిఖీ చేశారు. మంగళవారం సుమారు 300 మంది పింఛన్లను సర్వే చేశారు. ఇదే ప్రాంతంలో మరో మూడు రోజుల పాటు సర్వే ఉంటుందని సంబంధిత అధికారి తెలిపారు. ప్రభుత్వ ఆదేశం మేరకు జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ 9 బృందాలను, ఒక్కొక్క బృందంలో ఐదుగురికి తగ్గకుండా అధికారులను నియమించారు. సర్వే సమయంలో ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు 13 అంశాలపై పింఛన్ లబ్ధిదారులను అధికారులు వివరాలు అడిగి తెలుసుకుంటున్నారు. పింఛను లబ్ధిదారులు మూడు ఎకరాలకు మించి పల్లం భూమి, 5 ఎకరాలకు మించి మెట్టు భూమి కలిగి ఉన్నారా ? ఇంటి విద్యుత్తు 300 యూనిట్లు దాటి వస్తోందా ? కుటుంబ ఆదాయం ఎంత ? సొంత గృహం ఉందా ఉంటే దాని విస్తీర్ణం ఎంత, ఫోర్ వీలర్ వాహనం ఉందా ? అన్న విషయాలను సర్వే బృందాలు తెలుసుకుంటున్నాయి. నొక్కి నొక్కి పింఛన్‌దారులను వారు ప్రశ్నలు అడుగుతుండటంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. ప్రతినెలా తమకు అందుతున్న పింఛన్ ఇక మీదట అందుతుందా ? లేదా ? అనే సందేహాలను వ్యక్తపరుస్తున్నారు.

నగరంలో పోలీసు బదిలీలు

ఎన్.శ్రీనివాసరావు, ఎస్.ఆదిరాజు, ఉమెన్ ఎఎస్‌ఐ కెవి.రమాదేవి, హెడ్ కానిస్టేబుళ్లు ఎన్.నీలకంఠం, డికెవి.స్వామి, జి.సత్యనారాయణ, కె.అచ్యుతారావు, ఎం.అప్పలనాయుడు, ఎం.సూరి నాయుడు, టి.విజయ్ కుమార్, డి.ఆనందరావు, కె.శ్రీనివాసరావు, ఉమెన్ హెడ్ కానిస్టేబుల్ బి.అనురాధ, కానిస్టేబుళ్లు సిహెచ్.రమేష్, ఎం.రామారావు, కె.రాంబాబు, జె.మోహన్, ఎస్‌ఆర్‌ఎస్.సత్యనారాయణ, జి.దాలినాయుడు ఎం.నవీన్, ఉమెన్ కానిస్టేబుళ్లు పి.జానకి, కె.దివ్యవాణి, హసీనా బేగంలు బదిలీ అయిన వారిలో ఉన్నారు

వేతన ఒప్పందం అమలు చేయాలని ధర్నా

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వేతన ఒప్పందాన్ని వెంటనే అమలు చేయాలని, నాలుగు సంవత్సరాల బోనస్ బకాయిలు చెల్లించాలని, పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణ ఆపాలని డిమాండ్ చేస్తూ మంగళవారం విశాఖ పోర్టు ఎఒబి ఎదుట విశాఖ పోర్టు అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ చేసిన వేతన ఒప్పందం అమలు చేయకపోవడం గతంలో ఎన్నడూ జరగలేదన్నారు. మోడీ ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తూ కాలయాపన చేస్తోందన్నారు. విశాఖపట్నం పోర్టుకు ఈ ఏడాది రూ.725 కోట్లు లాభాలు వచ్చాయని, దానికి కార్మికుల శ్రమశక్తే కారణమని అన్నారు. అటువంటి కార్మికులకు అగ్రిమెంట్ అయిన వేతనాలను అమలు చేయకపోవడమేంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. బోసన్ సమస్యను పరిష్కరించాలన్నారు. పోర్టు హాస్పిటల్‌ను ప్రైవేటీకరించవద్దని అన్ని యూనియన్లు కోరుకుంటున్నా అందుకు విరుద్ధంగా యాజమాన్యం వ్యవహరించడం దారుణమన్నారు. కార్యక్రమంలో పోర్టు సిఐటియు నాయకులు బి.జగన్, కె.సత్యనారాయణ, వి.రామలింగేశ్వర రావు, విడిఎల్‌బి డాక్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి బి.లక్ష్మణరావు, పోర్టు ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి బిసిహెచ్.మసేన్, హెచ్ఎంఎస్ ట్రెజరర్ మంగయ్య నాయుడు, సిఎఫ్‌టియుఐ జాతీయ అధ్యక్షులు ఎన్.కనకారావు, ఐఎన్‌టియుసి అధ్యక్షులు చందు, బిఎంఎస్ కార్యదర్శి రవి, పెద్ద సంఖ్యలో కార్మికులు, పెన్షన్లు పాల్గొన్నారు.



ధర్నాలో కార్మిక సంఘాల నాయకులు

బాలల హక్కుల పరిరక్షణకు సహకారం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : బాలల హక్కుల పరిరక్షణకు విఎంఆర్‌డిఎ పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని సంస్థ ఛైర్మన్ ఎంవి.ప్రణవ్ గోపాల్ అన్నారు. మంగళవారం సిరిపురంలోని వుడా బిల్డింగ్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం ప్రణవ్ గోపాల్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం ఇరువురి మధ్య జరిగిన భేటీలో పలు విషయాలు చర్చకు వచ్చాయి.

14న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉమ్మడి విశాఖపట్నం జిల్లా పరిధిలోని అన్ని న్యాయస్థానాల్లో ఈనెల 14 న జాతీయ లోక్ అదాలత్ జరుగుతుందని జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. న్యాయస్థానాల్లో ఉన్న పెండింగ్ కేసులు, సివిల్, చెక్ బౌన్స్, బ్యాంకింగ్, మోటార్ ప్రమాదాల నష్టపరిహారాలు, సెక్షన్ 138 నెగోషియబుల్ ఇన్స్ట్రుమెంట్స్ చట్టం కేసులు, బ్యాంకు, మనీ రికవరీ కేసులు, ల్యాండ్ అక్విజిషన్ కేసులు, కార్మిక, కుటుంబ తగాదాలు (విడాకులు కేసులు కాకుండా), పారిశ్రామిక వివాదాలు, రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు పరిష్కారానికి వస్తాయన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాలకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, న్యాయ సేవా సదన్, విశాఖపట్నంలో లేదా 0891 - 2560414, 2575046 ఫోన్ నెంబర్లలో, vskpdlsa@yahoo.com, dlsa.vsp@gmail.com వెబ్‌సైట్లను, భీమిలి, గాజువాక, అనకాపల్లి, నర్సీపట్నం, ఎలమంచిలి, చోడవరం, మాడుగుల, అరకు, చింతపల్లి, పాడేరు మండల న్యాయ సేవా సంఘాలను సంప్రదించాలన్నారు.

సోలార్ విద్యుత్‌తో లాభాలు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎస్ఇ శ్యాంబాబు

ప్రజాశక్తి -ఆనందపురం : సోలార్ విద్యుత్‌తో ఎన్నో ప్రయోజనాలున్నాయని, ప్రతిఒక్కరూ పిఎం సూర్యఘర్ యోజన పథకం కింద కేంద్ర ప్రభుత్వం రాయితీతో సోలార్ విద్యుత్ కనెక్షన్లు పెట్టించుకోవాలని ఎపిఇపిడిసిఎల్ ఆపరేషన్స్ ఎస్ఇ జి.శ్యాంబాబు కోరారు. మంగళవారం వెల్లంకిలో సర్పంచ్ సర్పంచ్ ఉప్పాడ లక్ష్మణరావు అధ్యక్షతన పిఎం సూర్యఘర్ యోజనపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సంస్థఇఇ పి.శ్రీనివాసరావు, డిఇఇ రాజశేఖర్ మాట్లాడుతూ, సోలార్ విద్యుత్ కనెక్షన్ పొందడమెలాగో వివరించారు. వినియోగదారులు ఆసక్తి చూపితే కేంద్ర సబ్సిడీతోపాటు బ్యాంకులు రుణసదుపాయం కల్పిస్తాయన్నారు. ఈ సందర్భంగా పలువురు సోలార్‌కనెక్షన్లకు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. కార్యక్రమంలో ఎఇఇ సురేష్, డిపిఒ ఎంవివి.శ్రీనివాసరావు, ఇఒపిఆర్‌డి బి.సత్య నారాయణ, ఎంపిటిసి పి.అప్పలనాయుడు,చెన్నా నర్సింగ రావు, ఉపసర్పంచ్ కె.శ్రీనివాసరావు, గ్రామ కార్యదర్శి శ్రీరామమూర్తి, వార్డుసభ్యులు, బ్యాంకర్లు పాల్గొన్నారు.

మహిళ పొట్టలో కణితి తొలగింపు

● కెజిహెచ్‌లో క్లిష్టతర శస్త్రచికిత్స

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : క్లిష్టతరం, అరుదైన ఆపరేషన్ నిర్వహించి, మహిళ పొట్టలోని కణితిని తొలగించిన కెజిహెచ్ వైద్యులు ఆమె ప్రాణాలను కాపాడారు. వివరాలివి. ఒడిశా సరిహద్దులోని లబ్బూరు గ్రామానికి చెందిన సంధ్య అనే 19 ఏళ్ల యువతి పొట్టలో నొప్పితో గత నెల 20న కెజిహెచ్‌కు గైనిక్ ఒపికి వచ్చింది. ు. ఆమెకు స్కాన్ చేయించగా పొట్టలో కణితి ఉందని నిర్ధారించిన వైద్యులు, గైనిక్ విభాగంలో శస్త్రచికిత్స చేశారు. పెద్ద అండాశయ కణితికి ఆపరేషన్ చేసిన రెండు రోజుల తర్వాత ఆమెకు జ్వరం వచ్చి, బిపి పడిపోవంతో ఆరోగ్యం విషమమైంది. గుర్తించిన వైద్యులు, వెంటనే ఆమెను ఐసియుకు తరలించి, డాక్టర్ల బృందం పర్యవేక్షణలో వెంటిలేటర్‌తో ఇంట్యుబేట్ చేశారు. ఐసియులో నాలుగు రోజుల పాటు అత్యవసర వైద్య సేవలు అందించగా, ఆరోగ్యం కుదుటపడడంతో గైనిక్ వార్డుకు మార్చి, మంగళవారం డిశ్చార్జ్ చేశారు. క్లిష్టమైన శస్త్రచికిత్సలో పాల్గొన్న ప్రొఫెసర్ డాక్టర్ ఐ.వాణి, డాక్టర్ సుధాపద్మశ్రీ, డాక్టర్ కవిత, డాక్టర్ దేవి, డాక్టర్ కల్యాణి, ఎనస్థీషియా ప్రొఫెసర్ డాక్టర్ వి.రవి , డిసిఎస్ఆర్ఎంఒ డాక్టర్ జి.మెహర్‌కుమార్ బృందాన్ని కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద అభినందించారు.

ఆన్‌లైన్ డెలివరీల్లో మోసం!

● బుక్ చేయకుండానే ఇంటికి వస్తువులు
● అక్రమాలపై అడిగితే నిర్లక్ష్యపు సమాధానం
● ఆటోనగర్ ఇన్‌స్టాకార్ట్ సర్వీసెస్ నిర్వాకం
● లబోదిబోమంటున్న బాధితురాలు

ప్రజాశక్తి -గాజువాక : బుక్ చేయకుండానే ఇంటికి ఏవేవో వస్తువులను డెలివరీ చేసి, బలవంతంగా డబ్బులు వసూలుచేసి, తీరా మోసాన్ని గుర్తించి ప్రశ్నిస్తే నిర్లక్ష్యపు సమాధానం.. ఇదీ గాజువాక ఆటోనగర్‌లోని ఇన్‌స్టాకార్ట్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ నిర్వాకం. దీనికి సంబంధించిన వివరాలివి. గాజువాక శ్రీనగర్ నక్షత్ర టవర్‌లో నివాసముంటున్న వనజారావు అనే మహిళకు ఈనెల 9 ఆన్‌లైన్‌లో డెలివరీ వచ్చింది. తాను బుక్ చేయకుండానే వస్తువులు రావడమేంటని అనుమానం వ్యక్తం చేసిన ఆమె, దానిపై ఇన్‌స్టా కార్ట్ సర్వీసెస్‌కు చెందిన డెలివరీ బాయ్‌ను ప్రశ్నించగా, తెలిసిన వారెవరో బుక్ చేసి ఉంటారని చెప్పి తొందర చేయడంతో అయిష్టంగానే ఫోనుపేలో రూ.1018 చెల్లించి పార్శిల్ తీసుకున్నారు. తెరిచి చూసేసరికి డబ్బులకు సరిపడా వస్తువులు లేకపోవడంతో పాటు బుకింగ్‌తో తమకు సంబంధం లేదని గుర్తించి, మంగళవారం ఆటోనగర్‌లోని డెలివరీ సంస్థ కార్యాలయానికి వెళ్లి దీనిపై ఫిర్యాదు చేశారు. అక్కడున్న వ్యక్తి ఎక్కడినుంచి వచ్చాయో తమకు తెలియదని, డెలివరీ చేయడమే తమ బాధ్యత అంటూ నిర్లక్ష్యంగా, దురుసుగా సమాధానం చెప్పడంతో బాధిత మహిళ అవాక్కయ్యారు. ఎక్కడి నుంచి పార్శిల్ వచ్చిందో చెప్పాలని కోరినా పొంతన లేని సమాధానం చెప్పడంతోపాటు తామేమీ చేయలేయని చెప్పడంతో లబోదిబోమన్న బాధిత మహిళ తనకు జరిగిన మోసంపై ఆవేదన వ్యక్తం చేశారు. ఆన్‌లైన్ బుకింగ్‌లు, డెలివరీలు పేరుతో ప్రజలను మోసపుచ్చుతున్న ఇటువంటి వ్యవహారాలపై ప్రభుత్వం, అధికారులు, పోలీసులు తగు చర్యలు తీసుకోవాలని, బాధితులకు న్యాయం చేయాలని పలువురు కోరుతున్నారు.



కస్టమర్‌తో నిర్లక్ష్యంగా మాట్లాడుతున్న సంస్థ ప్రతినిధి



పార్శిల్‌లో వచ్చిన వస్తువులు

ప్రాధేయపడినా స్పందించలేదు



ఆన్‌లైన్ డెలివరీలో జరిగిన మోసంపై వివరాలు ఇవ్వాలని ప్రాధేయపడినా స్పందించలేదు. సరికదా నిర్లక్ష్యపు సమాధానంతో పాటు దాడిచేసేలా మాట్లాడారు. ఇలాంటి అక్రమాలు పునరావృతం కాకుండా ఉండాలంటే పోలీసులకు ఫిర్యాదు చేస్తా.

వనజారావు, బాధితురాలు

భవిత కేంద్రం సేవలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి -పద్మనాభం : మండల కేంద్రంలోని భవితకేంద్రం సేవలను సద్వినియోగం చేసుకోవాలని వికలాంగ బాలల తల్లిదండ్రులకు ఎంఇఒ పొన్నగంటి రమణ సూచించారు. మంగళవారం రెడ్డిపల్లి ఎంపిపి స్కూల్‌లోని భవిత కేంద్రంలో అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. వికలాంగ బాలలకు ఆటలు, పాటలు, నృత్యం, చిత్రకళ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. భవిత కేంద్రంలో అందుబాటులో ఉన్న సంసిద్ధత బోధన, ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీలతో పాటుగా ఎడిఎస్. ఉపకరణాలు, రవాణా, సహాయక భత్యం, బాలికల అదనపు భత్యం, ఉపకార వేతనాలు వంటి సౌకర్యాలపై అవగాహన కల్పించి, వినియోగించుకోవాలని సూచించారు. ఎంఇఒ.బాబూలాల్ మాట్లాడుతూ వికలాంగబాలల్లో అంతర్లీనంగా ఉన్న సామర్థ్యాలను గుర్తించి, ప్రత్యేకమైన బోధనా పద్ధతుల ద్వారా వారిని తీర్చిదిద్దాలని సూచించారు రెడ్డిపల్లి స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ ముద్రగడ సన్యాసిరావు, భవితా కేంద్ర రిసోర్స్ పర్సన్లు హెచ్. రాజ్‌కుమార్, ఎం.శ్రీనివాసరావు, హెచ్ఎం కె. కళావతి, ఉపాధ్యాయులు ఈశ్వరరావు, సామాజిక కార్యకర్త రమణ పాల్గొన్నారు.

ఎన్ఎడి కార్మికుల పోరాటానికి సంఘీభావం

●12న రక్షణరంగ కార్యాలయాల ఎదుట ఆందోళనకు పిలుపు



ఎన్ఎడి గేటు వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న రక్షణరంగ కార్మికులు

ప్రజాశక్తి -గోపాలపట్నం : 36మంది కార్మిక నేతలను అరెస్ట్ చేసి, ఆరుగురిపై కోర్టులో కేసు పెట్టిన ఎన్ఎడి యాజమాన్య వైఖరిని ఖండిస్తూ, వారికి సంఘీభావంగా మంగళవారం విశాఖలో రక్షణరంగంలో ఉన్న అన్ని యూనియన్లు, అసోసియేషన్ల నిరసన చేపట్టారు. ఇందులో భాగంగా నేవల్ డాక్‌యార్డు, ఎన్ఎడి గేట్ల వద్ద జరిగిన నిరసనలో ఎన్ఎడిసి యూనియన్ ప్రధాన కార్యదర్శి గుప్తల శ్రీనివాస్ మాట్లాడుతూ, ఎన్ఎడి యాజమాన్యం పునరాలోచించి, ఆరుగురిపై పెట్టిన కేసులను ఎత్తేయాలని, 36మందిపై సస్పెన్షన్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులు కష్టపడి పనిచేసిన ఓటీలకు పేమెంట్లు చేయాలని కోరారు.దీనిపై ఈనెల 12న దేశవ్యాప్తంగా అన్ని రక్షణ రంగ సంస్థల ఎదుట నిరసన చేపట్టాలని ఆలిండియా డిఫెన్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఇప్పటికే పిలుపునిచ్చిందన్నారు. కార్మికులు, కార్మికసంఘాల నాయకులపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా యాంటీ విక్టిమేజేషన్ డే జరపాలని అన్ని రక్షణరంగ యూనియన్లు తీర్మానించాయని, ఆ ఆందోళన జయప్రదంచేయాలని పిలుపునిచ్చారు. ఎన్ఎడి యాజమాన్యం స్పందించకుంటే, రానున్న రోజుల్లో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. నిరసనలో పెద్దఎత్తున కార్మికులు, యూనియన్ నేతలు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం బోడమెట్టపాలెం, జొన్నాడ టోల్‌ప్లాజా వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, విశాఖ కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్న జివిఎంసి ఒకటో వార్డు కొత్తపేటకు చెందిన పిట్ట నరసింగరావు (35) మృతిచెందాడు. సిఐ బి.సుధాకర్ కథనం ప్రకారం, కొత్తపేటకు చెందిన మృతుడు పిట్ట నరసింగరావు, పాడైన తన ద్విచక్ర వాహనాన్ని బాగుచేసేందుకు మోదవలసలో ఉన్న మెకానిక్ దుకాణానికి, స్నేహితుడు సంతోష్ కుమార్‌కు చెందిన స్కూటీ సహాయంతో వెళ్తున్న క్రమంలో ఎదురుగా అతివేగంగా వస్తున్న కారు ఇద్దరినీ ఢీకొంది. ఈ ప్రమాదంలో నరసింగరావు తలకు బలమైన గాయాలయ్యాయి.వెంటనే విశాఖ కెజిహెచ్‌కు తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ ఆరోగ్యం విషమించడంతో సోమవారం రాత్రి మృతి చెందాడు. ఈ ప్రమాదంలో సంతోష్‌కుమార్‌కు స్వల్పగాయాలయ్యాయి. మృతుని భార్య గౌరి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

95 మంది విద్యార్థులకు వైద్యపరీక్షలు



విద్యార్థులను పరీక్షిస్తున్న వైద్యులు

ప్రజాశక్తి -తగరపువలస : దివ్వాడ దివీస్ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం అన్నవరం ఎంపిపి పాఠశాలలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో అన్నవరం, పైలపేట పాఠశాలలకు చెందిన 95 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. పిహెచ్‌సి వైద్యులు కల్యాణి, రవీంద్ర విద్యార్థులకు వైద్యపరీక్షలు చేసి, అవసరమైన మందులు అందజేశారు. ప్రథమచికిత్స సామగ్రి అందజేసి ఆరోగ్య సూచనలు చేశారు. దివీస్ సిఎస్ఆర్ మేనేజర్ డి.సురేష్‌కుమార్, ప్రతినిధులు ఎ.శ్రీనివాస్, నరసింహ, వైద్యసిబ్బంది, హెచ్ఎంలు స్వాతి, భాస్కర్, సర్వేశ్వరరావు పాల్గొన్నారు

గొర్రెలకు వ్యాధి నిర్ధారణ పరీక్షలు

ప్రజాశక్తి- పద్మనాభం :అనారోగ్యంతో పలుజీవాలు మృత్యువాత పడడంపై పశుసంవర్ధకశాఖ అధికారులు స్పందించారు. మంగళవారం రెడ్డిపేట కొత్తకల్లాలులో వెంపలి రామారావుకు చెందిన గొర్రెల మందను విశాఖ ప్రాంతీయ పశు రోగ నిర్ధారణ కేంద్రం వైద్యులు డాక్టర్ హిమజ ఆధ్వర్యంలో సిబ్బంది సందర్శించి పరిశీలించారు. అనారోగ్యంతో బాధపడుతున్న జీవాల శ్వాసనాళాలు, మలం నుంచి శాంపిల్స్ సేకరించారు. అలాగే చనిపోయిన గొర్రెకు పోస్టుమార్టం చేసి, అందులోని అవయవ నమూనాలను సేకరించారు. వాటిని విజయవాడలోని విబిఆర్ఐకి విశ్లేషణకు పంపుతామని డాక్టర్ హిమజ వెల్లడించారు. నివేదికల ఆధారంగా పూర్తిస్థాయి వైద్యం అందిస్తామన్నారు. ప్రాథమిక లక్షణాలను బట్టి పొక్కుల వ్యాధి, నీలి నాలుక వ్యాధిగా అనుమానించి, తగు చికిత్స అందజేశారు. పెంపకందారులకు తగు సూచనలు చేశారు.

ప్రకృతి వ్యవసాయోత్పత్తులతో ఆరోగ్యం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఎరువులు, పురుగు మందులు వినియోగించకుండా కేవలం గో ఆధారిత ప్రకృతి వ్యవసాయంతో పండించిన వ్యవసాయోత్పత్తుల వల్ల ఆరోగ్యం, ఆనందం మనిషి సొంతమవుతాయని గో ఆధారిత ప్రకృతి వ్యవసాయ సంఘం అధ్యక్షులు వర్మ పేర్కొన్నారు. ఈ నెల 12వ తేదీ గురువారం నుంచి 15వ తేదీ ఆదివారం వరకు ఆంధ్ర విశ్వవిద్యాలయ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో తమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న 5వ విశాఖ ఆర్గానిక్ మేళా 2024 వివరాలను తెలిపేందుకు ఇంజినీరింగ్ కాలేజ్ మైదానంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్గానిక్ మేళాలో 300 స్టాళ్లను ఏర్పాటు చేయనున్నామన్నారు. సమావేశంలో గ్రీన్ క్లైమేట్ వ్యవస్థాపకులు రత్నం, భారత్ కిసాన్ సంఘ్ నేషనల్ సెక్రటరీ జలగం కుమార స్వామి పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలి

ప్రజాశక్తి - ఉక్కునగరం :వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ చర్యలను ఆపాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు యు.వెంకటేశ్వర్లు, డి.ఆదినారాయణ, వి.ప్రసాద్ కోరారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో తలపెట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారానికి 1398వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) కార్యకర్తలు కూర్చున్నారు. వారినుద్దేశించి నాయకులు మాట్లాడుతూ ప్రకృతి సంపదైన గనులను ప్రైవేటుకు అప్పగించడం తగదన్నారు. బొగ్గు గనులను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టడంతో ప్రజలు విద్యుత్ భారాలను మోయాల్సి వస్తోందన్నారు. తుదకు సోలార్ విద్యుత్ ఉత్పత్తిలోకి కూడా ప్రైవేటు వ్యక్తులు చొరబడి అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. అందుకు అదానీయే ఉదాహరణ అని తెలిపారు. ఇనుప గనులను ప్రైవేటు వ్యక్తులకు ఇస్తే రానున్నకాలంలో ఉక్కు పరిశ్రమ తీవ్ర ఇబ్బందులకు గురవుతుందన్నారు. గనుల, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ ప్రజల బాధ్యతని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు యు.మరిడయ్య, కె.బాలశౌరి, దేముడు నాయుడు, మనోజ్, అప్పలరాజు, అంజి, సుభాష్, హరిబాబు, ఎన్ఎంవిఎస్.ప్రసాద్, బొండ శ్రీను, డిసిహెచ్.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



దీక్షల్లో కూర్చున్న నాయకులు, ఉక్కు కార్మికులు

పెన్షనర్స్‌డేను జయప్రదం చేయండి


మాట్లాడుతున్న పెన్షనర్ల యూనియన్ నేత

ప్రజాశక్తి-ములగాడ : ఈనెల 17న నిర్వహించే జాతీయ పెన్షనర్స్‌డేలో పింఛనుదారులు పాల్గొని జయప్రదంచేయాలని ఎపి రిటైర్డ్ పర్సన్స్ అండ్ పెన్షనర్స్ యూనియన్ నేతలు డిమాండ్ చేశారు. మంగళవారం వెంకన్నపాలెం సిఐటియు కార్యాలయంలో కె.నూకరాజు అధ్యక్షతన ఎపిఆర్‌పిఎ సంఘ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సిహెచ్ తమ్మారావు మాట్లాడుతూ, ప్రతినెలా ఒకసారి సమావేశమై సమస్యలపై చర్చిద్దామన్నారు. నూకరాజు మాట్లాడుతూ, గతనెల 16న విద్రోహదినం జయప్రదం చేసిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌కె. హుస్సేన్ మాట్లాడుతూ, సిబిటిపై పెన్షనర్లు ఆశలు పెట్టుకున్నా, హయ్యర్ పెన్షన్ అంశం ఎజెండాలో లేదని ఆవేదన వెలిబుచ్చారు. సిఐటియు, బిఎంఎస్ ప్రతినిధులు దీనిపై మంత్రిని నిలదీయగా, సిబ్బందికి సూచనలు చేశారే తప్ప స్పష్టమైన చర్యలు లేవన్నారు. గతేడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా ఐదుపోట్ల పెన్షనర్స్‌డేను జరుపుకుందామని, పారిశ్రామిక ప్రాంతంలో శ్రీహరిపురంలోని విశ్రాంత ఉద్యోగుల సంక్షేమసంఘం భవనంలో నిర్వహించాలని నిర్ణయించామన్నారు. సమావేశంలో ఎం.సూర్యారావు, హెచ్‌పిసిఎల్, కోరమండల్, షిప్‌యార్డు పెన్షనర్లు పాల్గొన్నారు.

డిమాండ్లు నెరవేర్చేవరకు దీక్షలు విరమించం


దీక్షలకు సంఘీభావం తెలుపుతున్న బలిరెడ్డి

ప్రజాశక్తి -గాజువాక : విశాఖ డెయిరీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను యాజమాన్యం నెరవేర్చే వరకు దీక్షలను కొనసాగిస్తామని వారు స్పష్టం చేశారు. మంగళవారం 20వ రోజున విశాఖ డెయిరీ కార్మికుల దీక్షలు కొనసాగగా, టిఎన్‌టియుసి నేత బలిరెడ్డి సత్యనారాయణ దీక్షాశిబిరం వద్దకు వచ్చి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విశాఖ డెయిరీ ఉద్యోగులను పిఆర్‌సిలో చేర్చి అమలు చేయాలని, ప్రమోషన్లు కల్పించాలని,కాంట్రాక్ట్ కార్మికులకు చట్టం ప్రకారం వేతనాలు పెంచాలని, అపరిష్కృత సమస్యలను పరిష్కరించాలని, పాత సహకార పద్ధతిలోనే విశాఖ డెయిరీని నిర్వహించాలని డిమాండ్ చేశారు. విశాఖ డెయిరీ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎస్.రమణ, దాడి నాగమాణిక్యం, డెయిరీ ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

ఐహెచ్‌ఆర్‌సి నూతన కార్యవర్గం

వేపగుంట: స్థానిక కృష్ణానగర్ ఐహెచ్‌ఆర్‌సి ప్రధాన కార్యాలయంలో అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా జనరల్ బాడీ సమావేశం నిర్వహించి నూతన కార్యవర్గంలో ఎపి స్టేట్ జనరల్ సెక్రెటరీగా జి సత్యనారాయణ, ఉత్తరాంధ్ర లీగల్ అడ్వైజర్‌గా ఎం శ్రీనివాసరావులను ఎంపిక చేసి, నియామక పత్రాలను నేషనల్ చైర్మన్ రాజాన ప్రసాదరావు అందజేశారు. అనంతరం లక్ష్మీపురంలోని హెల్ప్ అండ్ హెల్ప్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఫర్ బ్లైండ్‌లో ఉన్న వారికి దుప్పట్లు పండ్లు పంపిణీ చేశారు. సమావేశంలో నేషనల్ సెక్రెటరీ ఆర్.ఇషిత, ట్రెజరర్ ఆర్.విజయ, జి.అజయ్ కుమార్, డి.లక్ష్మీనాయుడు, బి డేవిడ్, ఎస్.అచ్చిరెడ్డి, టి రుద్రప్రసాద్, గంగేశ్వరి, సిహెచ్ సాయినాథ్‌రెడ్డి, జి శ్రీనివాస్, సిహెచ్ సీతారాం, ఎస్.గణేష్, బి.రమేష్, సత్యం అప్పారావు, బి నరసింగరావు, జ్యోతిసంతోషి పాల్గొన్నారు.

కౌశల్ క్విజ్ పోటీల్లో విజయదుర్గ ప్రతిభ



విజయదుర్గను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఆన్‌లైన్‌లో జరిగిన కౌశల్ క్విజ్ పోటీల్లో జివిఎంసి రెండోవార్డు రాయిపాలెం ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థిని విజయదుర్గ ప్రతిభ కనబరిచి, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం జె.రాధాకుమారి తెలిపారు. సైన్స్ టీచర్ బి శైలజ శిక్షణలో విద్యార్థినిప్రతిభ కనబరిచిందన్నారు. విజయదుర్గను అభినందించారు

సైన్స్ పట్ల అవగాహన కోసం పిఎంశ్రీ

ప్రజాశక్తి -మధురవాడ : పాఠశాల విద్యార్థులలో సైన్స్ పట్ల అవగాహన పెంచడానికి కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పిఎమ్‌శ్రీ) కార్యక్రమాన్ని మంగళవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో నిర్వహించారు. శ్రీకాకుళం జవహర్ నవోదయ విద్యాలయం విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొని, గీతంలోని అధునాతన పరిశోధనశాలలను, కేన్సర్ బయాప్సీ ప్రయోగశాల, మూర్తి ప్రయోగశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కెఎస్.కృష్ణ మాట్లాడుతూ, సైన్స్‌లో సందేహలను విద్యార్థులు ఎప్పటికప్పుడు నివృత్తి చేసుకోవాలని, ప్రాథమిక అంశాలపై పట్టు సాధించాలని సూచించారు. నూతన విద్యావిధానంలో భాగంగా పిఎమ్‌శ్రీ కార్యక్రమం పాఠశాల విద్యా విధానాన్ని నూతన పంథాలోకి నడిపించగలదన్నారు. కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.వేదవతి, భౌతికశాస్త్ర విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ స్పందన, వివిధ విభాగాల అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న గీతం అధ్యాపకులు

అభివృద్ధి, పథకాల అమలుపై సమీక్ష

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : .ఈ నెల 11, 12 తేదీల్లో విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ల సదస్సు నేపథ్యంలో జిల్లాలోని అన్ని శాఖల అధికారులతో అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలు తీరుపై జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ సమీక్షించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్వర్ణాంధ్ర విజన్ -2047, విశాఖపట్నం విజన్ - 2029 ప్రణాళికపై సుదీర్ఘంగా చర్చించారు. ఇప్పటివరకు మొదలు పెట్టిన పనులు, వాటి తాజా స్థితి, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల తీరుపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎన్‌టిఆర్ సామాజిక పింఛన్లు, దీపం పథకం-2, ప్రజా ఫిర్యాదుల పరిష్కారం, గృహ నిర్మాణాలు తదితర పథకాలపై ఆయా శాఖల అధికారులను ఆరా తీశారు. సంబంధిత అంశాల తాజా పరిస్థితిని తెలుపుతూ నివేదికలు పొందుపరచాలని సూచించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి బిహెచ్. భవానీ శంకర్, సిపిఒ శ్రీనివాసరావు, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

అపూర్వ కలయిక



పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి- గాజువాక : జివిఎంసి 87వ వార్డు కణితి హైస్కూల్ 1990-91 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆత్మీయ కలయిక మంగళవారం జరిగింది. పూర్వ విద్యార్థులు, అప్పట్లో పనిచేసే ఉపాధ్యాయులంతా పాల్గొని రోజంతా ఉల్లాసంగా గడిపారు. నాటి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం గురువులను ఘనంగా సత్కరించారు. 34ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో అందరి మోములో ఆనందం వెల్లివిరిసింది. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు దుగ్గపు దానప్పలు, బలిరెడ్డి నాగేశ్వరరావు, ఆరంగి సత్యనారాయణ, కొణతాల సూరిబాబు, కుంచ రమణారావు, పితాని సూర్యనారాయణ, అంగటి కృష్ణ, ఎల్లపు నూకరాజు, తుంపాల శ్రీను పాల్గొన్నారు.

భీమిలిని ఆదర్శంగా తీర్దిదిద్దుతా

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని రామవరం పంచాయతీలో రూ.1.60కోట్ల ఉపాధి హామీ నిధులతో భీమం దొరపాలెం కనెక్టివిటీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మంగళవారం శంకుస్థాపన చేశారు. అనంతరం రామవరం గ్రామస్తుల చిరకాల కోరిక బిఎస్ఎన్ఎల్ సెల్‌టవర్‌ను ప్రారంభించి, 4జి సేవలు అందుబాటులోకి తీసుకువచ్చారు. రామవరం గ్రామ సర్పంచ్ ఎర్రరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే గంటా మాట్లాడుతూ, రామవరం, భీమం దొరపాలెం, కోలవానిపాలెం, కణమాం సర్పంచ్‌లు రాజు, చిన్నికుమారి, సోములమ్మ శ్రీకాంత్, ఆబోతు అప్పలరాము పట్టుబట్టి తమ గ్రామాల అభివృద్ధికి నిధులు రాబట్టుకున్నారన్నారు. యువ సర్పంచ్‌ల నేతృత్వంలో ఆయా పంచాయతీలు అభివృద్ధి చెందుతున్నాయని, వారికి తనవంతు పూర్తి సహకారం ఉంటుందన్నారు. భీమిలిని మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్‌ల కోరిక మేరకు.రామవరం నుంచి గంగసాని అగ్రహారం వరకు మరో రోడ్డు నిర్మాణానికి రూ.60 లక్షలను ఎమ్మెల్యే గంటా మంజూరుచేశారు. ఇళ్లపట్టాలు, డ్రైనేజీలు,వీధిరోడ్లు ఇతర సమస్యలపై గంటాకు విన్నవించిన, వారు గజమాలతో ఆయనను ఘనంగా సత్కరించారు.. జనసేన భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి పంచకర్ల సందీప్ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వంలో పంచాయతీలకు పూర్వవైభవం వస్తోందని, దానికి ఇక్కడ చేపడుతున్న అభివృద్ధి పనులే నిదర్శనమన్నారుఈ సందర్భంగా స్కూల్ ఆఫ్ థియేటర్‌ఆర్ట్స్ చిన్నారుల నృత్యాలు, సీతారామాంజనేయ బృందం కోలాటం అందర్నీ అలరించాయి. కార్యక్రమంలో అగరపు దేవుడుబాబు, కట్టమూరి సోమునాయుడు ఎర్ర రాము సోంబాబు, తాట్రాజు అప్పారావు, బిఆర్‌బి నాయుడు, బలిరెడ్డి మల్లికార్జునరావు (చంటి), ఎంపిటిసి గొలగాని కృష్ణ, మహంతి శివాజీ, పాండ్రంకి అప్పలరాజు, రామకృష్ణ పాల్గొన్నారు.


రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గంటా

ప్రపంచ వ్యాప్తంగా మానవ హక్కుల ఉల్లంఘన

ఐద్వా ఆధ్వర్యాన పలు చోట్ల ప్రదర్శనలు



అనకాపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న ఐద్వా నేతలు, మహిళలు

ప్రజాశక్తి -అనకాపల్లి

ప్రపంచ వ్యాప్తంగా నేడు మానవ హక్కులకు ఉల్లంఘించబడుతున్నాయని ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రభావతి అన్నారు. మహిళా హక్కులే మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా మంగళవారం ఐద్వా ఆధ్వర్యంలో పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత మహిళల మీద, చిన్నారుల మీద దాడులు విపరీతంగా పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. పరిశ్రమల్లో పనిచేసే మహిళలకు కనీసం వేతనాలు లేక అల్లాడిపోతున్నారన్నారు. గంజాయి, డ్రగ్స్ ఎక్కడపడితే అక్కడ అమ్మడం వల్ల యువత వాటికి బానిసలవుతున్నారని, దీంతో చిన్నారులపైన, మహిళలపైన దాడులు పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. మద్యాన్ని ప్రభుత్వం ఆదాయం వనరుగా చూడకూడదన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి డిడి వరలక్ష్మి, అధ్యక్షురాలు పి మాణిక్యం, జాయింట్ సెక్రెటరీ ఆర్ లక్ష్మి, జిల్లా కమిటీ సభ్యురాలు జి సుభాషిణి, జిల్లా నాయకురాలు మంగ, సునీత, నాగమణి, శిరీష, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళలపై దాడులను అరికట్టాలి : ఐద్వా

నర్సీపట్నం టౌన్ : మహిళలు, చిన్నారులపై జరుగుతున్న లైంగిక దాడులను అరికట్టాలని, మద్యం, మాదకద్రవ్యాలు, గంజాయి వాడకాన్ని అరికట్టాలని, అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో మంగళవారం నర్సీపట్నం డివిజన్ కమిటీ స్థానిక కొత్త వీధిలో ప్రదర్శన చేపట్టారు. ఇంటింటి ప్రచారం నిర్వహించారు. డిసెంబర్ 10 మానవ హక్కుల దినం సందర్భంగా జరిగిన ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా నాయకులు ఎల్.గౌరి, కె.వి సూర్యప్రభ మాట్లాడుతూ, ప్రభుత్వాలు అనుసరించే విధానాల మూలంగా మహిళలపై దాడులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరగడంతో పేదలు చాలా ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కుటుంబాలు గడవడం కష్టంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు ప్రసన్న, రాజేశ్వరి, సామ్రాజ్యం తదితరులు పాల్గొన్నారు.

హక్కుల పరిరక్షణకు ఐద్వా ర్యాలీ, మానవహారం

కలెక్టరేట్ : అంతర్జాతీయ మానవ దినోత్సవాన్ని పురస్కరించుకుని విశాఖ నగరంలో ఐద్వా ఆధ్వర్యాన 'మహిళా హక్కులే - మానవ హక్కులు' నినాదంతో మంగళవారం మానవహారం నిర్వహించారు. తొలుత జివిఎంసి గాంధీ విగ్రహం నుంచి ఆర్‌టిసి కాంప్లెక్స్ సమీపంలోని గురజాడ జంక్షన్ వరకూ ర్యాలీ చేపట్టారు. అక్కడి కూడలిలో తలపెట్టిన మానవహారాన్ని ఉద్దేశించి సంఘం రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రభావతి, విశాఖ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.పద్మ, వై.సత్యవతి మాట్లాడుతూ ఇటీవల కాలంలో విశాఖ జిల్లాలో బాలికలు, విద్యార్థినులు, మహిళలపై దాడులు, అత్యాచారాలు, హత్యలు పెరగడంపై ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో రాజకీయ, ఆర్థిక, సామాజిక హక్కులను పొందడం, వాటికోసం పోరాడటం ప్రజాస్వామ్యం కల్పించిన హక్కు అన్నారు. మహిళ రక్షణకు, సమానత్వానికి చట్టాలు ఉన్నప్పటికీ వాటిని పాలకులు అమలుచేయడంలో విఫలమవుతున్నారన్నారు. యువత మద్యం, డ్రగ్స్‌కు అలవాటు పడి వారి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. ప్రభుత్వాలు సాంఘిక దురాచారాలను అరికట్టాల్సింది పోయి ప్రోత్సహించేలా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. ప్రాథమిక హక్కులను కాలరాస్తున్నాయన్నారు. ఈ నేపథ్యంలో మానవ హక్కులను ప్రోత్సహించడానికి, ప్రభుత్వాన్ని జవాబుదారీగా ఉంచడానికి బలమైన స్వతంత్ర పౌర సమాజాన్ని మనమే తయారు చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి పి.మణి, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యుఎస్ఎన్.రాజు, కె.సంతోష్, ఐద్వా జిల్లా నాయకులు ఆర్.వరలక్ష్మి, కె.మణి, కె.కుమారి, బి.భారతి, కె.అనురాధ, వెంకటలక్ష్మి, కె.సంతోషం, బి.మమత, ఒ.విజయ పాల్గొన్నారు.



విశాఖలో మానవహారం నిర్వహిస్తున్న ఐద్వా నేతలు, మహిళలు



నర్సీపట్నంలో ర్యాలీ చేస్తున్న దృశ్యం

ఇప్పటికీ మానవ హక్కుల ఉల్లంఘన

విశాఖ కలెక్టరేట్ : ఇప్పటికీ మానవ హక్కుల ఉల్లంఘనలు అనేక చోట్ల జరుగుతూనే ఉన్నాయని దామోదర సంజీవయ్య లా యూనివర్సిటీ మాజీ ఉపకులపతి ప్రొఫెసర్ వై.సత్యనారాయణ అన్నారు. మానవ హక్కుల కౌన్సిల్ రాష్ట్ర కార్యదర్శి మంత్రి శ్యాం ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం వేడుకలు అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా 'అందరికీ స్వేచ్ఛ - అందరికీ సమానత్వం, న్యాయం' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ప్రొఫెసర్ సత్యనారాయణ మాట్లాడుతూ రాజ్యాంగం ప్రజలకు అనేక హక్కులను కల్పించిందని, ప్రభుత్వాలు తమ అధికార దుర్వినియోగంతో వాటికి భంగం కలిగిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి శ్యాంప్రసాద్ మాట్లాడుతూ తాము నిరంతరం మానవ హక్కుల పరిరక్షణే లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షులు పి.జగన్మోహన్ రావు, ప్రతినిధులు ఎన్‌వి.రమణ, సోమసుందరరావు, బి.మల్లేశ్వరరావు, నక్కాని అప్పారావు పాల్గొన్నారు. మానవ హక్కులు, చట్టాలపై నిర్వహించిన పోటీల్లో విజేతలైన వారికి బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం మానవ హక్కుల కౌన్సిల్ క్యాలెండర్‌ను ఆవిష్కరించి పంపిణీ చేశారు.

ఆత్మగౌరవ హక్కును హరిస్తోన్న మోడీ ప్రభుత్వం

సీతమ్మధార : ఆత్మగౌరవంతో స్వేచ్ఛగా జీవించే హక్కు లేకుండాచేసి, మానవ హక్కులను కేంద్రంలోని మోడీ ప్రభుత్వం హరిస్తోందని పలువురు వక్తలు దుయ్యబట్టారు. మంగళవారం ప్రపంచ మానవ హక్కుల దినం సందర్భంగా అంబేద్కర్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఇస్కఫ్ జిల్లా అధ్యక్షులు జెవి.ప్రభాకర్ , అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ అధ్యక్షులు బొడ్డు కళ్యాణరావు, గ్లోబల్ నెట్‌వర్క్ జిల్లా కార్యదర్శి రామప్రభు, అరసం జిల్లా కార్యదర్శి ఉప్పల అప్పలరాజు, దళిత హక్కుల పోరాట సమితి నాయకులు చిన్నారావు మాట్లాడుతూ దళితులు, మైనార్టీలపై దాడులు చేస్తూ, వారి హక్కులు కాలరాస్తూ మతోన్మాద రాజకీయానికి మోడీ ప్రభుత్వం పాల్పడుతోందన్నారు. గిరిజన ప్రాంతాలను బలవంతంగా ఖాళీ చేయించి ప్రకృతి సంపదను కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేస్తున్న కేంద్రం, వ్యతిరేకించిన వారిని నక్సలైట్ల పేరుతో హతమారుస్తోందని ఆరోపించారు. ప్రపంచాన్ని చుట్టివస్తున్న ప్రధాని మోడీకి, మహిళలను నగ్నంగా ఊరేగించి, అవమానించిన మణిపూర్‌లో పర్యటించే తీరిక లేదాయని ప్రశ్నించారు. అంబేద్కర్ విజ్ఞాన కేంద్రం విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా మానవ హక్కుల దినోత్సవం

అనకాపల్లి : స్థానిక డైట్ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మంగళవారం మానవ హక్కుల దినోత్సవం నిర్వహించారు. మానవ హక్కుల ప్రాముఖ్యత, వాటి పరిరక్షణ, బాధ్యతల గురించి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వైకుంఠరావు విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో సిఎస్ఇ విభాగాధిపతి డాక్టర్ కె. సుజాత, విద్యార్థులు లక్ష్మి ప్రసీద, టాన్సి రాణి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ కె.మోహన్‌రావు, యూనిట్ విద్యార్థులు పాల్గొన్నారు.

సబ్బవరం : మండలంలోని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వ విద్యాలయంలో అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. వర్సిటీ ఉపకులపతి ఆచార్య డి.సూర్య ప్రకాశరావు మాట్లాడుతూ జాతి, మతం, నమ్మకాలతో సంబంధం లేకుండా మానవ హక్కులు మనందరికీ చెందినవని, వ్యక్తి యొక్క హక్కులను రక్షించడం ప్రభుత్వాల విధి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో వర్సిటీ అధ్యాపకులు ఆచార్య నందిని, డాక్టర్ దయానంద మూర్తి, నాగేశ్వరావు, డాక్టర్ లక్ష్మి ప్రసంగించారు. విశ్వవిద్యాలయ అధ్యాపకులు, అధ్యాపకేతరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ భవనం వద్ద నినాదాలు చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు



మందులు పంపిణీ చేస్తున్న డాక్టర్ రామ్మోహన్‌రావు

ఉచిత పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రభుత్వ నిర్వహించే ఉచిత పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి డాక్టర్ రామ్మోహన్ రావు అన్నారు. మండలంలోని చిన్నమాకవరం గ్రామంలో మంగళవారం పశుసంవర్థక పశు గణాభివృద్ధి రాష్ట్రీయ గోకుల్ మిషన్‌లో భాగంగా ఉచిత పశు గర్భకోశ చికిత్స శిబిరం, పాడి రైతుల అవగాహన సదస్సు నిర్వహించారు. 56 పశువులకు గర్భకోస వ్యాధి చికిత్సలు, 18 పశువులకు చూడు నిర్ధారణ పరీక్షలు, 40 పెయ్యిలకు నట్టల నివారణ మందులు అందజేసినట్టు మండల పశు వైద్యాధికారి డాక్టర్ అనిల్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా లేగ దూడల పశువుల యాజమాన్యంలో తీసుకోవలసిన జాగ్రత్తలు తెలియజేశారు. ప్రభుత్వం 60 శాతం రాయితీపై ఇస్తున్న లింగ నిర్ధారణ వీర్యం పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అనకాపల్లి సహాయ సంచాలకులు డాక్టర్ సౌజన్య, డాక్టర్ రామారావు, డాక్టర్ భాను, డాక్టర్ పృథ్వి, జెవిడి కుమారి, సిబ్బంది వెంకట్, కిరణ్, రాము, అప్పారావు పాల్గొన్నారు.

13న జూనియర్ ఆర్చరీ పోటీలకు ఎంపికలు

ప్రజాశక్తి-పరవాడ : ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లాల సబ్ -జూనియర్ ఆర్చరీ చాంపియన్ షిప్ రికర్వ్, కాంపౌండ్, ఇండియన్ రౌండ్ విభాగాలలో పాల్గొనేందుకు ఉమ్మడి విశాఖపట్నం జిల్లా ఆర్చరీ క్రీడాకారుల ఎంపిక ఈ నెల 13వ తేదీన మండలంలోని సంస్కృతి గ్లోబల్ స్కూల్లో నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి విశాఖపట్నం జిల్లా ఆర్చరీ అసోసియేషన్ చైర్మన్ పి.సూర్యనారాయణ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఈ నెల 13 తేదీ ఉదయం 9 గంటలకు సంస్కృతి గ్లోబల్ స్కూల్ ఆర్చరీ గ్రౌండ్‌కు హాజరు కావలని, ఫోటో, ఆధార్ కార్డు, జనన ధ్రువపత్రం తీసుకొని రావాలని సూచించారు.

16న ప్రశాంతిలో ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి-అచ్యుతాపురం : స్థానిక ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం ఎకోమా పరిశ్రమలో ఉద్యోగ నియామకాలకు సంబంధించి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాల వ్యవస్థాపకులు ధర్మిరెడ్డి ప్రసాద్ తెలిపారు. ఐటిఐ, డిప్లమో, ఏదైనా డిగ్రీ చదివిన అభ్యర్థులు ఇంటర్వ్యూకు హాజరు కావచ్చని పేర్కొన్నారు. ఇంటర్వ్యూలకు హాజరు కాబోయే అభ్యర్థులు ఎత్తు 5.2, వయసు 18 నుంచి 25 సంవత్సరాలు, బరువు 50 కేజీలు తప్పనిసరిగా ఉండాలని సూచించారు. మరిన్ని వివరాలకు 97012 41753 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

జనసేనలో కెవి.రమణ చేరిక

ప్రజాశక్తి-అచ్యుతాపురం : వైసిపి నాయకుడు, మండలంలోని మార్టూరు గ్రామానికి చెందిన కట్టుమూరి వెంకటరమణ తన అనుచరులతో కలిసి మంగళవారం జనసేన పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. అచ్యుతాపురం ఎస్‌టిబిఎల్ కాలనీలోని ఎమ్మెల్యే విజయ్ కుమార్ స్వగృహం వద్ద కాకర్లపూడి హరిబాబు, ద్వారపురెడ్డి బాబ్జి ఆధ్వర్యంలో కెవి.రమణ జనసేనలో చేరారు. ఆయనకు ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో కాకి హరీష్, జాగరపు సన్నీ త్రిమూర్తులు, నానాజీ, అప్పలరాజు, చంటి, సంతోష్, పరదేశి, నానాజీ, రాజు, అప్పారావు పాస్టర్, జై రాజు, రాజేష్ వర్మ తదురులు పాల్గొన్నారు.



జనసేన పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే సుందరపు

స్కూల్ శానిటేషన్ కార్మికులకు 6 నెలల జీతాలు చెల్లించాలి : సిఐటియు

ప్రజాశక్తి-పరవాడ : ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో పనిచేస్తున్న శానిటేషన్ కార్మికులకు గత 6 నెలలుగా జీతాలు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే ప్రభుత్వం వారికి వేతనాలు చెల్లించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. పరవాడలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగ భద్రత లేకపోవడంతో పాటు ప్రమాదవశాస్తూ మృతి చెందినా ఇన్సూరెన్స్ లేకపోవడంతో అకాల మరణాలు సంభవిస్తే ఆ కుటుంబం రోడ్డున పడుతుందని పేర్కొన్నారు. కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత, ప్రమాద బీమా, ఐడెంటిటీ కార్డులు, యూనిఫామ్ వంటి సౌకర్యాలు ప్రభుత్వం వెంటనే కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ యూనియన్ మండల అధ్యక్షురాలు పి రామలక్ష్మి, కార్యదర్శి ఏ ముత్యాలమ్మ, బి పార్వతి తదితరులు పాల్గొన్నారు.

వెల్నెస్ సెంటర్‌ను సందర్శించిన టాస్క్ ఫోర్స్ బృందం

ప్రజాశక్తి-అనకాపల్లి : కశింకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని సత్యనారాయణ పురం- 2, హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్‌ను అనకాపల్లి జిల్లా టాస్క్ ఫోర్స్ బృందం ప్రతినిధి డాక్టర్ లూసి కార్డిలియా బృందంతో కలిసి మంగళవారం సందర్శించారు. ఆరోగ్య కేంద్రం వద్ద వివిధ రికార్డులు పరిశీలించారు. ఆరోగ్య సిబ్బంది గర్భిణీలు, కిశోర బాలికలకు రక్త పరీక్షలు నిర్వహించి, చికిత్సలు చేసారు. ఇక్కడి ప్రజలకు అందుతున్న వైద్య, ఆరోగ్య సేవలు గూర్చి విచారణ చేసి సంతృప్తి వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆఫీస్‌కు చెందిన డిపిఒ - జగదీశ్, ఎస్ఓ రామచంద్రరావు, కశింకోట వైద్యులు డాక్టర్ తిరుపతిరావు, హెచ్ఇఒ సత్య నారాయణ, సూపర్వైజర్స్, ఏఎన్ఎంలు, హెచ్‌వి లు, ఆశలు పాల్గొన్నారు.

అల్పపీడనం పట్ల జిల్లా యంత్రాంగం అప్రమత్తం

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

ప్రజాశక్తి-అనకాపల్లి

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరిక మేరకు జిల్లా యంత్రాంగాన్ని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ అప్రమత్తం చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్-08924-226599, 222888 ఏర్పాటు చేసారు. ముఖ్యంగా వర్షాల నేపథ్యంలో వరి కోతలు, ఇతర వ్యవసాయ పనుల్లో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. కోతకు సిద్ధంగా ఉన్న పంటను వర్షాలకు ముందు కోయరాదని, ఇప్పటికే కోసిన పంట ఆరకపోతే ఎకరాకు 25 కిలోల ఉప్పును పనలపై చల్లుకుంటూ కుప్ప వేసుకోవడం వల్ల నష్టశాతాన్ని నివారించ వచ్చని చెప్పారు. వ్యవసాయ అధికారులు రైతులకు తగిన సూచనలు సలహాలు అందించాలని, రైతులకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. అధికారులు, సిబ్బంది అందరూ వారి హెడ్ క్వార్టర్స్‌లో ఉండాలన్నారు. అంగన్వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎం, ఎంఎల్ హెచ్పి, సీహెచ్ డబ్ల్యులతో సహా ఎవరూ ప్రధాన కేంద్రాన్ని విడిచి వెళ్లరాదని స్పష్టం చేశారు. వర్షాలు వలన మంచినీరు కలుషితమయ్యే అవకాశం ఉందని, మంచినీటి వనరులను, పైపులైనులను తనిఖీ చేయాలని, సంరక్షణకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలని, రాకపోకలకమిబ్బందులు రాకుండా ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. శిథిలావస్థలో ఉన్న భవనాలు, స్లాబ్ లు పడిపోయే అవకాశం ఉన్న భవనాలు, మట్టి ఇళ్లల్లో ఉన్న వారిని సురక్షిత భవనాల్లోకి తరలించాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితులకు అవసరమైన నిత్యవసర సరుకులు, మందులు సిద్ధం చేసుకోవాలని పౌర సరఫరాల శాఖ, ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు.

ఆందోళన చెందుతున్న రైతులు

బుచ్చయ్య పేట : వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో వరి రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. మండలంలోని పలు గ్రామాలలో వరి పంట కోతకు వచ్చింది. కోతల కోసి కుప్పలుగా పెట్టడానికి రైతులు సిద్ధంగా ఉన్నారు. గత వారం రోజుల క్రితం అల్పపీడనం హెచ్చరికలతో వరి రైతులు కోతలను వాయిదా వేసుకున్నారు. తీరా వారం రోజులు కూడా గడవక ముందే మరలా వర్షాలు కురుస్తాయని 15వ తేదీ వరకు జల్లులు పడతాయని హెచ్చరికలతో రైతులు మరింత ఆందోళన చెందుతున్నారు. కొన్ని గ్రామాలలో వరిచేలు పూర్తిగా పండిపోయి గింజల రాలిపోయే పరిస్థితి ఉండడంతో కొంతమంది రైతులు వరి పంటను కోసి మడుల్లోనే విడిచిపెట్టారు. కోసిన చేనును కూర్చి కుప్పలు పెట్టడానికి సిద్ధంగా ఉన్నారు. ఏది ఏమైనా ఈ ఏడాది వరి రైతులను వాతావరణం మాత్రం ఇబ్బందులు పెట్టిందనే చెప్పవచ్చు. ఏ మాత్రం వర్షం కురిసిన రైతులు తీవ్రంగా నష్టపోతారని పలువురు రైతులు వాపోతున్నారు.



కుప్పలు పెట్టడానికి వరి పనలను సిద్ధం చేసిన దృశ్యం

50 శాతానికి పైగా వరి కోతలు

దేవరాపల్లి : మండలంలోని 3664 హెక్టార్లు విస్తీర్ణంలో వేసిన వరి పంటలో 50 శాతం పైగా కోతలు కోసి, కుప్పలు పెట్టుకోవడం జరిగిందని మండల వ్యవసాయ అధికారిని ఎల్.వై. కాంతమ్మ తెలిపారు. ఈ మేరకు మండలంలోని వరి కుప్పలు పెడుతున్న రైతుల కల్లాలను ఆమె సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 10 నుంచి 13వ తేదీ వరకు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిక నేపథ్యంలో రైతులంతా బాధ్యతగా ఆలోచించి, కోసిన వరి పనలను కుప్పలుగా వేసుకోవాలని సూచించారు. కుప్పలు గాలికి ఎగిరిపోకుండా, తడిసిపోకుండా టార్పలిన్ కప్పి బరువు పెట్టాలన్నారు. నూర్పులను వాతావరణ పరిస్థితులు అనుకూలించే వరకు వాయిదా వేసుకోవాలని, పంటను కోయాలనుకునేవారు వాయిదా వేసుకోవాలని ఆమె సూచించారు.

'కిశోరి వికాసం' సమర్ధవంతంగా అమలు చేయాలి

ప్రజాశక్తి-సబ్బవరం : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కిశోరి వికాసం కార్యక్రమాన్ని సమర్ధవంతంగా అమలు చేయాలని సబ్బవరం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఒ లలిత కుమారి అన్నారు. స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో సిపిడిఒ లలిత కుమారి ఆధ్వర్యంలో అంగన్వాడీలకు, ఎఎన్ఎంలకు, మహిళా పోలీసులకు, వెల్ఫేర్ అసిస్టెంట్లకు, ఉపాధ్యాయులు, ఆధ్యాపకులకు కిశోరి వికాసంపై మండల స్థాయి శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. 11 ఏళ్ల నుంచి 18 ఏళ్ల వయసు ఉన్న ఆడపిల్లలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మహిళా రక్షణ చట్టాలు, బాల్య వివాహాల నిర్మూలన, సమస్యలను ఎదుర్కొనే సామర్థ్యం వంటి అంశాలపై శిక్షణ అందించారు. సిఐ పిన్నింటి రమణ మహిళల రక్షణ చట్టాలు, ఆత్మ రక్షణ, స్త్రీ హక్కులను గూర్చి వివరించారు. కార్యక్రమంలో ఎంఈఓ రవీంద్రబాబు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

టిడిపి సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని శింగవరం, గోకవానిపాలెం, తీడ గ్రామాలలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం మంగళవారం చేపట్టారు. దీనిని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నిమ్మదల సన్యాసి నాయుడు, ద్వారపురెడ్డి సత్తిబాబు, గోకివాడ లోవకృష్ణ, మహారాజు, మేడిశెట్టి సన్యాసి నాయుడు, చిరికి చైతన్య, గోగడ వినోద్, చూసుకొండ దుర్గాప్రసాద్, కొండ్రపు ప్రదీప్ పాల్గొన్నారు.

పంట కోత ప్రయోగాలే దిగుబడికి ఆధారం

ప్రజాశక్తి-సబ్బవరం : పంటకోత ప్రయోగాలే పంట దిగుబడి లెక్కింపునకు ఆధారమని అనకాపల్లి జిల్లా వ్యవసాయ ముఖ్య ప్రణాళిక అధికారి (సి.పి.ఓ) జి.రామారావు అన్నారు. మండలంలోని మొగలిపురం గ్రామంలో మంగళవారం జరిగిన వరి పంట కోత ప్రయోగాన్ని ఆయన పాల్గొని పరిశీలించి పంట దిగుబడిని లెక్కించారు. ఈ కార్యక్రమంలో డివైఎస్ఓ రాజేశ్వరరావు, ఏఎస్ఓ రమాదేవి, రైతులు పాల్గొన్నారు.

డిసిసి అధ్యక్షుడిని కలిసిన నాగేశ్వరరావు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షులు మీసాల సుబ్బన్నను నర్సీపట్నం ఆయన స్వగృహం వద్ద మండలంలోని ఆకుల హెల్పింగ్ ఫౌండేషన్ కార్యదర్శి ఆకుల నాగేశ్వరరావు మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆకుల హెల్పింగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లాలో సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు.

సీసీ ప్లాట్ ఫామ్ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-సబ్బవరం : సబ్బవరం మేజర్ పంచాయతీ శివారు గొల్లలపాలెంలోని కళామందిరం వద్ద సీసీ ప్లాట్ ఫామ్ నిర్మాణ పనులకు సోమవారం సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు శంకుస్థాపన చేశారు. సుమారు రూ.1.50 లక్షలతో ఈ ప్లాట్ ఫామ్ నిర్మించనున్నట్లు సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు పల్లా వరలక్ష్మి, ఉప సర్పంచ్ మండల లక్ష్మణ, ఎంపీటీసీ బైలపూడి దేముడుబాబు, పీఏసీఎస్ మాజీ ఉపాధ్యక్షుడు పల్లా కృష్ణ, స్థానిక నాయకులు పల్లా అప్పలనాయుడు, పల్లా అప్పలరాజు, పల్లా రమణ పాల్గొన్నారు.

104 వైద్య శిబిరం

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని కేపీ అగ్రహారంలో మంగళవారం 104 వైద్యసేవల్లో భాగంగా గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. రోగులకు బీపీ, షుగర్ తదితర పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిటిసి దేవర అప్పారావు, వైద్య సిబ్బంది పవన్ కుమారి, ఏఎన్ఎం హైమావతి, ఆశ వర్కర్ రమణమ్మ, 104 సిబ్బంది అంజి తదితరులు పాల్గొన్నారు.

మిడ్డేమీల్స్‌కు మిక్సీ వితరణ

ప్రజాశక్తి-చోడవరం : మండలంలోని రాయపురాజుపేట ప్రాథమిక పాఠశాలకు రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేటి నాగ గంగాధర్ మిక్సీని అందజేశారు. మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు పిల్లలకు మరింత వేగవంతంగా వంటలు చేసి వడ్డించేందుకు వీలుగా ఉంటుందని పాఠశాలకు అందించినట్లు గంగాధర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సర్పంచ్ రామనాయుడు పాల్గొన్నారు.



మిక్సీ అందిస్తున్న బొడ్డేటి నాగ గంగాధర్

చెరుకు రైతులకు బకాయిలు చెల్లించాలి

గోవాడ సుగర్స్ ఎమ్‌డికి ఏపి చెరుకు రైతు సంఘం వినతి

ప్రజాశక్తి-చోడవరం

గోవాడ సుగర్ ఫ్యాక్టరీ పరిధిలో చెరుకు రైతులకు బకాయిలు రూ.7 కోట్లు తక్షణమే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ చెరుకు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కర్రి అప్పారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు గోవాడ సుగర్స్ ఎమ్‌డిని మంగళవారం కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ గోవాడ సుగర్ ఫ్యాక్టరీకి చెరుకు సరఫరా చేసిన రైతులకు నేటికీ పేమెంట్లు ఇవ్వకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, నిరాశతో చెరుకు పంట విస్తీర్ణం తగ్గించి వరి, సరుగుడు ఇతర పంటల వైపు రైతులు మళ్లీ పోతున్నారని పేర్కొన్నారు. కనీసం మద్దతు ధర, ప్రభుత్వం ప్రోత్సాహం లేదన్నారు. ఫ్యాక్టరీని ఆధునికీకరిస్తామని, ఇథనాల్ యూనిట్ ఏర్పాటు చేస్తామని చెప్పిన గత ప్రభుత్వం పట్టించుకోలేదని పేర్కొన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే డిస్టలరీ యూనిట్ ఏర్పాటు చేస్తామని వాగ్దానాలు చేశారని, కాని నేటికీ ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదని తెలిపారు. రైతుల్లో నమ్మకాన్ని కలిగించేటట్లు వెంటనే బకాయిలు చెల్లించాలని, కనీసం మద్దతు ధర సోమనాథన్ కమిటీ సిఫార్సులు మేరకు టన్నుకు రూ.5000 ప్రకటించాలని, ఫ్యాక్టరీని ఆధునికీకరించి డిస్టలరీ యూనిట్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు గండి నాయన బాబు, ఎస్వి నాయుడు, బి దేవుళ్ళు, శరగడం విశ్వనాథం, బుద్ధగిరి పెంటయ్య, ఈశ్వరరావు, పొలంశెట్టి తాత అప్పారావు పాల్గొన్నారు.

కల్లుగీత కార్మికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలి

ప్రజాశక్తి చోడవరం

కల్లుగీత కార్మికుల సమస్యలు పరిష్కరించి వారికి ఉపాధి అవకాశాలు కల్పించాలని ఆంధ్ర ప్రదేశ గీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర దేవుడు డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో మంగళవారం చోడవరం ఎక్సైజ్ సిఐ పాపునాయుడుకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా దేవుడు మాట్లాడుతూ గత ప్రభుత్వం గీత కార్మికులకు ఏదో చేస్తానని ఏమీ చేయకుండా అన్యాయం చేసిందని, నేడు కూటమి ప్రభుత్వంపై ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నా ఎటువంటి ప్రయోజనం లేదన్నారు. గీత కార్మికులకు ఉపాధి మార్గాలు చూపించాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని, గీత కార్మిక కార్పొరేషన్‌ను పునరుద్ధరించాలని, ఆదరణ పథకాన్ని పున:ప్రారంభించాలని డిమాండ్ చేశారు. తాటి చెట్టు ద్వారా 200 రకాల ఉత్పత్తులను తయారు చేయవచ్చని సైంటిస్టులు సూచిస్తున్నారని, ప్రభుత్వం ఆ దిశగా గీత కార్మికులకు ప్రోత్సాహం అందించాలని కోరారు. గీత చెట్టుకు పది రూపాయలు పన్ను కట్టించుకుని కార్మికులకు వాటిపై హక్కు కల్పించాలని, తాటి చెట్లను నరికి వేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో 9 సంఘాలకు చెందిన సభ్యులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా పైలా అప్పలనాయుడు 20వ వర్ధంతి

ప్రజాశక్తి-పరవాడ : వైసిపి రాష్ట్ర సీఈసీ సభ్యులు పైల శ్రీనివాసరావు తండ్రి, పరవాడ మాజీ ఎమ్మెల్యే పైల అప్పలనాయుడు 20వ వర్ధంతి పరవాడ సంతబయలు వద్ద మంగళవారం నిర్వహించారు. మాజీ మంత్రి, వైసిపి విశాఖ జిల్లా అధ్యక్షులు గుడివాడ అమర్నాథ్, పెందుర్తి మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ముఖ్య అతిథులుగా విచ్చేసి పైలా అప్పలనాయుడు కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా గుడివాడ అమర్నాధ్ మాట్లాడుతూ పరవాడ నియోజకవర్గ అభివృద్ధికి పైల అప్పలనాయుడు ఎంతో కృషి చేశారని కొనియాడారు. అనంతరం వర్ధంతి సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రి, మండల పరిషత్ పాఠశాలలో, అంగన్వాడి కేంద్రాల్లో రొట్టెలు, పండ్లు పైల అప్పలనాయుడు మనవడు పైల సాయి అప్పలనాయుడు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీలు పైల వెంకట పద్మలక్ష్మి, బోకం సూర్య కుమారి రామునాయుడు, జడ్పిటిసి పిఎస్.రాజు, వైసిపి నాయకులు బొడ్డెడ ప్రసాద్, బైలపూడి భగవాన్ జైరామ్, గండి రవికుమార్, చుక్క రామునాయుడు, కోటన రాము, కోన రామారావు, వెన్నెల సన్యాసిరావు, వైస్ ఎంపీపీలు బంధం నాగేశ్వరరావు, దళాయి నదియా, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, నాయకులు పాల్గొన్నారు.



అమ్మవారికి పూజలు చేస్తున్న మాజీ ఎంపీ పప్పల తదితరులు

వైభవంగా జంపమాంబ అమ్మవారి ఉత్సవాలు

ప్రజాశక్తి-యలమంచిలి : మున్సిపాలిటీ పరిధి సోమలింగపాలెంలో ప్రతి మూడేళ్లకు జరిగే జంపమాంబ అమ్మవారి పండుగ మంగళవారం ఘనంగా జరిగింది. వేల సంఖ్యలో వచ్చిన పరిసర గ్రామాల ప్రజలు అమ్మవారిని దర్శించుకొని తమ మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌర్యం కలుగకుండా స్థానిక నాయకులు ఏర్పాట్లు చేశారు. కుటుంబ వారసత్వంగా పండుగలు నిర్వహించే సర్పంచ్‌ల కుటుంబంలో జన్మించిన కర్రి రూప్నీ పండుగ బాధ్యతలు స్వీకరించారు. తన అత్త, తల్లి కూడా సోమలింగపాలెం సర్పంచ్‌లుగా పనిచేశారు. తాను కూడా జనసేన ద్వారా ప్రజాసేవ చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. మాజీ ఎంపీ పప్పల చలపతిరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ కమిషనర్ పిల్లా రమాకుమారి, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్రను రూప్నీ ప్రత్యేకంగా ఆహ్వానించి అమ్మవారి దర్శనం చేయించారు. అమ్మవారిని దర్శించుకున్నవారిలో టిడిపి నేతలు కర్రి శివ, నానాజీ, రవి కుమార్, జంపపాలెం వెంకట్, జనసేన నేత బొద్దపు శ్రీను తదితరులున్నారు. సాయంత్రం నుండి పెద్ద ఎత్తున బాణాసంచా కల్చారు. కళ్ళు మిరుమిట్లు గొలిపే విద్యుత్ కాంతుల్లో నేల వేషాలు, స్టేజీ కార్యక్రమాలతో రాత్రంతా జాతర జరిగింది. గ్రామంలో అనేక చోట్ల అన్న సంతర్పణ కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం జరక్కుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

మంచినీటి ట్యాంకు నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని వాలాబు పంచాయితీ శివారు విప్పగురువు, బుచ్చంపాలెం గ్రామాలకు మంచినీటి సదుపాయం కల్పించడం కోసం జల్ జీవన్ మిషన్ పథకం నిధులతో నిర్మిస్తున్న మంచినీటి ట్యాంక్ నిర్మాణ పనులను స్థానిక సర్పంచ్ పోడెల వెంకటలక్ష్మి సమక్షంలో సంబంధిత అధికారులు మంగళవారం పరిశీలించారు. తాగునీరు సదుపాయం లేక గిరిజనులు గెడ్డ నీరు తాగుతున్నారని తెలుసుకున్న ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా రూ.50 లక్షలు మంజూరు చేశారని సర్పంచ్ పోడెల వెంకటలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పోడెల బుజ్జి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చంద్రశేఖర్, పంచాయతీ వార్డు సభ్యులు సిహెచ్.వరహాల నాయుడు, టి శ్రీరామ్, పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు



మాట్లాడుతున్న సురేంద్ర

ప్రజాశక్తి-అనకాపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల ద్వారా అనేక భూ సమస్యల పరిష్కారం కానున్నట్లు రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర అన్నారు. జీవీఎంసీ విలీన గ్రామం వల్లూరులో మంగళవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడుతూ ఐదేళ్లలో వైసిపి పాలనలో పేరుకుపోయిన భూ సమస్యలను పరిష్కరించే దిశగా కూటమి ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులకు ప్రజల్లో మంచి స్పందన వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్వో విజయ్ కుమార్, ఆర్ఐ రమేష్, ఎండోమెంట్ అధికారి రవి, సబ్ రిజిస్ట్రార్ ఆఫీసర్ నాగరత్నం, కూటమి పార్టీ నాయకులు ప్రెసిడెంట్ సత్యనారాయణ, నాయుడు, సూరప్పారావు పాల్గొన్నారు.

పరవాడ : మండలంలోని తానాం గ్రామంలో సర్పంచ్ కన్నూరు దేవి అధ్యక్షతన రెవెన్యూ సదస్సు జరిగింది. మండల ప్రత్యేక అధికారి వై శ్రీనివాసరావు, ఈడి హౌసింగ్ అధికారులు మాట్లాడారు. కార్యక్రమంలో తహశీల్దారు ఎస్వి అంబేద్కర్, జనసేన నియోజకవర్గం ఇంచార్జ్ పంచకర్ల ప్రసాద్, జడ్పిటిసి పిఎస్ రాజు, మాజీ జడ్పిటిసి పైల జగన్నాధరావు తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం : మండలంలోని వంగలి గ్రామంలో మంగళవారం జరిగిన రెవిన్యూ సదస్సులో భూ సమస్యలపై 9 అర్జీలు అందినట్లు స్థానిక తహసీల్దార్ బి.చిన్నికృష్ణ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆకుల శ్రీహేమా గణేష్, ఎంపీటీసీ గవర తులసి రాజు, ఆర్ఐ వీరయ్య, వీఆర్వో రవి, వంగలి-2 వీఆర్వో ఎస్. కామరాజు పాల్గొన్నారు.

కోటవురట్ల: రెవిన్యూ సమస్యలను పరిష్కరించుకునేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులు దోహదపడతాయని తహసిల్దార్ తిరుమల బాబు తెలిపారు. పీకే పల్లిలో మంగళవారం స్థానిక సర్పంచ్ బెన్నమ్మ సమక్షంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు 80 ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. ప్రధానంగా మ్యూటిషన్ సమస్యలే అత్యధికంగా 40 వరకు అందినట్లు తెలిపారు. రీ సర్వే లో జరిగిన పొరపాట్లపై 22, ఎఫ్ఎంసి 5, అడంగల్ కరప్షన్ 5తో పాటు వివిధ ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ ఊర్ధ్వరావు, ఎంపీటీసీ సభ్యులు శ్రీనివాస్, వీఆర్వో రమేష్ పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలు పరిష్కరిస్తాం

నక్కపల్లి: రెవెన్యూ పరమైన సమస్యలు సత్వర పరిష్కారాన్ని కృషి చేస్తానని తహసిల్దార్ నరసింహామూర్తి అన్నారు. నక్కపల్లిలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. నక్కపల్లిలో సుమారుగా 24 ఎకరాలు పట్టా భూమి ఎండోమెంట్ భూమిగా నమోదయిందని, దీంతో రిజిస్ట్రేషన్లు అవ్వడం లేదని, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సమస్యను పరిష్కరించాలని కోరుతూ వైస్ ఎంపీపీ నానాజీ, నాయకులు మేడేటి శంకర్,మీగడ సత్తిబాబు, అల్లాడ కొండ, బంగార్రాజు, శ్రీను తదితరులు తహసిల్దార్ కు వినతిపత్రం అందజేసారు. పలువురు భూ సమస్యలపై అర్జీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జయ రత్నకుమారి, తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్, రాజు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఆనందపురం : మండలంలో వేములవలస గ్రామంలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూసదస్సులో 39 అర్జీలు వచ్చాయి, పట్టాదారు పాసుపుస్తకం కోసం ఏడుగురు, సర్వేలో తేడాలు సరిచేయాలని 26మంది, 22ఎ సమస్యలపై ఏడుగులు అర్జీలు ఇచ్చారని డిటి చేతన్‌కుమార్ తెలిపారు. ఎంఆర్ఐ రీటా, స్థానిక సర్పంచ్ లంక కొండమ్మ, ఉప సర్పంచ్ జ్ఞానేశ్వర్, విఆర్ఒలు పాల్గొన్నారు.

ములగాడ: జివిఎంసి 61వ వార్డు పారిశ్రామిక ప్రాంతంలోని మల్కాపురం గ్రామాన్ని సర్వే నెంబరు ఒకటిగా పరిగణించాలని గ్రామకమిటీ సభ్యులు కోరారు. మరిడమాంబ కళ్యాణ మండపంలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే పి.గణబాబు పాల్గొనగా, ఆయనకు వినతిపత్రం అందజేశారు. దీనిపై ఎమ్మెల్యే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కూటమి నాయకులు అంగదుర్గ ప్రశాంతి, సర్వసిద్ధి శ్రీలక్ష్మి, మజ్జి సోమేశ్. కాకి పోలిరెడ్డి, నీలాపు జ్యోతి, డొప్ప. సన్యాసిరావు, మజ్జి. మాలనాయుడు, ఊరుకుటి.పైడిరాజు పాల్గొన్నారు,

పద్మనాభం : రైతుల ఆధీనంలో ఉన్న శివాలయ భూములను కొందరు క్రయవిక్రయాలు చేస్తున్నారని, దీనిపై తగు చర్యలు తీసుకోవాలని వైసిపి నేత ఎ. అప్పారావు కోరారు. మండలంలోని పాండ్రంగి పంచాయతీ కొర్రపల్లి రెవెనూ సదస్సులో పత్యేక అధికారి ఎస్ సుధాసాగర్‌కు వినతిపత్రం అందజేశారు. తహశీల్దార్ కె.చంద్రరావు పాల్గొన్నారు.

వడ్డాది : భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని తహశీల్దార్ ఎం.లక్ష్మీ తెలిపారు. బుచ్చయ్యపేట మండలం లోపూడిలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో మండల ప్రత్యేక అధికారి గోపాలరాజుతో కలిసి ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎస్. నామాజీ, విఆర్ఓ జే. సుధాకర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహశీల్దార్ లక్ష్మి



మాట్లాడుతున్న పాపారావు

హెచ్‌ఎంపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: కుల వివక్ష చూపుతున్న రోలుగుంట మండలం కొమరవోలు జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటరావుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రెల్లి హక్కుల రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు ఎర్రంశెట్టి పాపారావు డిమాండ్ చేశారు. మంగళవారం చెట్టుపల్లి లో జరిగిన దళిత సమావేశంలో ఆయన మాట్లాడుతూ. దళిత ఉపాధ్యాయుడు కేశవరావు పై కుల వివక్ష చూపుతున్నారని దీనిపై జిల్లా విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. హెచ్‌ఎంపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అన్యాయంగా ఉపాధ్యాయుడి జీతం ఆపేసి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ మానసిక వేధింపులకు గురి చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు పి మోహన్‌రావు, స్వామి, బెన్నేసులు, రాము పాల్గొన్నారు.

'ఓపెన్' పరీక్షల్లో నవోదయ పబ్లిక్ స్కూల్ సత్తా

ప్రజాశక్తి -రావికమతం: 2022- 2023 ఏడాదికి సంబంధించి బి.ఎ, బి.కాం, బి.ఎస్సి ఆంధ్ర యూనివర్సిటీ కరస్పాండెన్స్ కోర్సులలో రావికమతం నవోదయ పబ్లిక్ స్కూల్ సత్తా చాటింది. ఈ సందర్భంగా నవోదయ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ చంద్రశేఖర్ పట్నాయక్ మాట్లాడుతూ, 2022-23 ఏడాదికి సంబంధించి తమ స్కూల్ ద్వారా 87 మంది విద్యార్థిని, విద్యార్థులను కరస్పాండెంట్స్ ద్వారా ఆంధ్రా యూనివర్సిటీకి పంపించడం జరిగిందన్నారు. పంపించిన 87 మంది ఉత్తీర్ణులైనట్టు తెలిపారు. తాము వారికి అందించిన శిక్షణ తోపాటు, విద్యార్థులు చదువు పైన చూపించిన ఆసక్తి, తల్లిదండ్రుల సహకారంతో ఇంతటి ఉత్తీర్ణత సాధించడం సాధ్యమైందని తెలిపారు. ప్రతి విద్యార్థి 70 శాతం మార్కులు తక్కువ లేకుండా ప్రతి ఒక్కరు సాధించడం జరిగిందన్నారు. ఓపెన్ టెన్త్, ఇంటర్ తరగతులలో 2023- 24 ఏడాదికి సంబంధించి 95శాతం ఉత్తీర్ణత సాధించడం జరిగిందన్నారు. గత 24 సంవత్సరాల నుండి మూడు వేల మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారన్నారు. తమ పాఠశాలలో ఎల్‌కెజి నుండి 7వ తరగతి వరకు విద్యాబోధన చేయడం జరుగుతుందన్నారు.అనేక మంది ఉద్యోగాలు సంపాదించి స్థిరపడ్డారన్నారు.



చంద్రశేఖర్
కరస్పాండెంట్

అదుపుతప్పి కారు బోల్తా

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని వేంపాడు జాతీయ రహదారిపై కారు అదుపుతప్పి బోల్తా పడింది. ప్రయాణికులు సురక్షితంగా బయటపడడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. రాజమండ్రి నుంచి విశాఖపట్నం వెళ్తున్న కారు మంగళవారం వేంపాడు వద్దకు వచ్చేసరికి ముందు వెళ్తున్న లారీని తప్పించబోయే క్రమంలో అదుపుతప్పి డివైడర్ ను ఢీకొని అవతల వైపు రోడ్డుకు దూసుకు వెళ్లి బోల్తా పడింది. ఈ కారులో నలుగురు ప్రయాణికులు ఉన్నారు. వీరంతా సురక్షితంగా బయటపడినట్లు సిఐ కుమారస్వామి, ఎస్ ఐ సన్నిబాబు తెలిపారు. పోలీసులు ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి -ఎస్.రాయవరం : మండలంలో వరి సాగు రైతులు కోతలు మొదలు పెట్టారని, కూటమి ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని సిపిఎం మండల కార్యదర్శి ఎం. సత్యనారాయణ డిమాండ్ చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఒక పక్క తుఫాన్ హెచ్చరికలతో మరో పక్క ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. రైతులకు ఇస్తానన్న పెట్టుబడి సాయం వెంటనే అందించి రైతంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేసారు.



గణేష్‌తో మాట్లాడుతున్న అమర్‌నాథ్

మాజీ ఎమ్మెల్యేకు అమర్‌నాథ్ పరామర్శ

ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్: మాజీ శాసనసభ్యులు పెట్ల ఉమా శంకర్ గణేష్ హైదరాబాద్ కిమ్స్ హాస్పిటల్ కాలికి సర్జరీ పూర్తి చేసుకుని ఇంటికి వచ్చారు. ఈ సందర్భంగా మంగళవారం మాజీ మంత్రి అమరనాథ్ గణేష్‌ను కలుసుకొని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గంలో వైసిపి పార్టీ కార్యక్రమాలపై అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గ మండల కమిటీలను ఏర్పాటు చేసి సరైన నాయకులను సూచించి నిర్ణయాలు తీసుకోవాలని కోరారు.



అవగాహన కల్పిస్తున్న మండల ఇన్‌చార్జి

సేంద్రియ వ్యవసాయంపై అవగాహన

ప్రజాశక్తి -మాడుగుల: రసాయన ఎరువులు ఉపయోగించి పండించే వరి కన్నా ప్రకృతిలో లభించే ఔషధాలతో సేంద్రీయ పద్ధతుల ద్వారా పండించే వరి అధిక దిగుబడినిస్తుందని సేంద్రియ వ్యవసాయ మండల ఇన్చార్జ్ గండి శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం ముకుందపురం గ్రామంలో సేంద్రీయ సాగుపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పకృతి వ్యవసాయ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: మున్సిపల్ కార్మికులకు బకాయి జీతాలు చెల్లించాలని సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక ఎన్టీఆర్ మినిస్టేడియంలో మంగళవారం గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు రుత్తల శంకరరావు మాట్లాడుతూ, నవంబర్ నెల జీతం తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. డిసెంబరు 10వ తేదీ వచ్చినప్పటికీ నవంబర్ నెల జీతం ఇప్పటివరకూ ఇవ్వలేదని, ఇలా అయితే కార్మికులు ఏ విధంగా బతుకుతారని ప్రశ్నించారు. పారిశుద్ధ్య కార్మికులను ఆదుకోవాలని కోరారు. క్రిస్టమస్, సంక్రాంతి పండగల నెలలో జీతాలు సకాలంలో ఇవ్వక పోవడంతో కార్మిక కుంటుంబాలు కుటుంబాలను నడుపుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇఎస్ఐ కటింగ్ అవుతున్నా కార్డులు ఇవ్వలేదన్నారు. ప్రమాదాలు జరుగుతున్నా సెలవులు ఇవ్వలేదన్నారు.

సిఐటియు ఆధ్వర్యంలో నిరసన



నినాదాలు చేస్తున్న నాయకులు, కార్మికులు

ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు, కెవిపిఎస్ జిల్లా ప్రదాన కార్యదర్శి ఈరెల్లి చిరంజీవి, యూనియన్ నాయుకులు జోగులు, బోర్రా శ్రీను, కుపరాల రాజు, అర్జమ్మ, దుర్గా, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల పనులకు నిధులు మంజూరు

ప్రజాశక్తి -నక్కపల్లి: కూటమి ప్రభుత్వం హయాంలో గ్రామీణ ప్రాంతాల్లో గతుకుల రోడ్ల నిర్మాణాలు చేపడుతున్నామని తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్ అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, హెూం మంత్రి వంగలపూడి అనిత ఆధ్వర్యంలో మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణాలు, మరమ్మతులకు నిధులు మంజూరైనట్లు తెలిపారు. ఉపాధి హామీ పథకం ద్వారా రూ. 7 కోట్లు నిధులు మంజూరయ్యాయని, 5 సిసి రోడ్లకు రూ. 5కోట్లు, గ్రామీణ ప్రాంతాల్లో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ, కల్వర్టు నిర్మాణాలకు రూ. 2 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. గొడిచెర్ల జాతీయ రహదారి నుండి చీడిక, దేవవరం జాతీయ రహదారి నుండి చినరామభద్రపురం, జి.జగన్నాధపురం నుంచి ముకుంద రాజుపేట, దోసలపాడు నుంచి ముకుంద రాజుపేట, గునుపూడి నుండి గోపాలపట్నం వరకు సిసి రోడ్లు మరమత్తు పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. రూ.2కోట్ల నిధులతో అమలాపురం, బంగారమ్మపేట, చినదొడ్డుగల్లులో సిమెంటు రోడ్లు, డ్రైనేజీ కల్వర్టు నిర్మాణాలు చేపట్టనున్నట్లు వెంకటేష్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మునిషా బేగంలు పెదపూడి శంకర్రావు, ఫాతిమా మున్నిషా బేగం, కూటమి నాయకులు రాజారావు, కొండబాబు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న వెంకటేష్

ఉపాధ్యాయులకు బోధనేతర పనులు తగ్గించాలి

ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి

ప్రజాశక్తి -నక్కపల్లి:ఉపాధ్యాయులకు బోధనేతర పనులను ప్రభుత్వమే అప్పగించి ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యలేదనడం చెప్పడం హాస్యాస్పదమని ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ పి.డి.ఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయ గౌరీ విమర్శించారు. పాయకరావుపేటలో మంగళవారం ఆమె ప్రభుత్వ విద్యా సంస్థలను సందర్శించి తనకు ప్రథమ ప్రాధాన్యత ఓటును వేయాలని ఉపాధ్యాయులను కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, 50కి పైగా యాప్ లను ప్రతి దినం నిర్వహిస్తూ అనేక కార్యకలాపాలు నిరంతరం అప్పగించి, విద్యా బోధనకు తీరిక లేకుండా చేస్తున్నారన్నారు. నాణ్యమైన విద్యబోధించే ప్రభుత్వ ఉపాధ్యాయులకు, పాఠశాలలపై వివిధ ప్రయోగాలు చేస్తూ పాఠశాలలకు స్టార్ రేటింగ్ తక్కువగా ఉందనడం భావ్యం కాదన్నారు. జీవో 117తో ప్రభుత్వ పాఠశాలలు నిర్వీర్యం అయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. పి.ఆర్.సి., డి.ఎ.లపై న్యాయపోరాటం చేయాలన్నారు. ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీగా తనను గెలిపిస్తే రానున్న కాలంలో ఉద్యమాలకు అండగా నిలుస్తానని, సమస్యలపై శాసన మండలిలో గళం విప్పుతానన్నారు. పోరాటాలలో ప్రత్యక్షంగా తోడుగా నిలుస్తానన్నారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ నియోజక వర్గ ఎన్నికలలో తనకు ప్రథమ ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని ఉపాధ్యాయులను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్. జిల్లా అధ్యక్షురాలు వత్సవాయి శ్రీలక్ష్మి, జిల్లాకోశాధికారి జోగా రమేష్, పాయకరావుపేట యుటిఎఫ్ మండల శాఖ అధ్యక్షులు కట్టా శ్రీరామ చంద్రమూర్తి, సహాధ్యక్షులు కట్టా శ్రీను, కోశాధికారి గర్లంక సతీష్, జీ.వి. గోపాలరావు, గౌరవ అధ్యక్షులు కోడి నానాజీ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి విజయ గౌరి

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలి

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్:నర్సీపట్నంలో మంగళవారం పోలీస్ శాఖ, సిఎమ్ఆర్ షాపింగ్ మాల్ సంయుక్తంగా హెల్మెట్ వాడకంపై అవగాహన కార్యక్రమంలో భాగంగా టౌన్ సిఐ గోవిందరావు ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక పోలీస్ స్టేషన్ నుండి అబిడ్ సెంటర్ మీదుగా సిఎమ్ఆర్ షాపింగ్ మాల్ వరకు హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని నినాదాలు చేస్తూ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ గోవిందరావు మాట్లాడుతూ, ప్రతి ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ ధరించాలన్నారు. ఐఎస్ఐ మార్కు కలిగిన హెల్మెట్ మాత్రమే వాడితే ప్రాణ నష్టం జరగకుండా ఉంటుందని తెలిపారు. సిఎంఆర్ షాపింగ్ మాల్ మేనేజర్ కాసం మాట్లాడుతూ హెల్మెట్ వాడకంతో యాక్సిడెంట్లు తగ్గుతాయని ఆయన తెలిపారు. ఈ ర్యాలీలో పట్టణ ఎస్ఐ జె రమేష్, షాపింగ్ మాల్ సిబ్బంది పాల్గొన్నారు.

సిఎంను కలిసిన రాజేష్

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:మున్సిపాలిటీ అభివృద్ధిపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును మున్సిపల్ కౌన్సిలర్ స్పీకర్ అయ్యన్నపాత్రుడు తనయుడు చింతకాయల రాజేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం నర్సీపట్నం మున్సి పాలిటీ కౌన్సిలర్ చింతకాయల రాజేష్ సీఎం క్యాంపు కార్యాల యంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ సమస్యలు, అభివృద్ధి చర్యలపై సిఎంకు తెలిపారు.

సాయుధ దళాల పతాక నిధికి రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్:సాయుధ దళాల పతాక నిధికి లైన్స్ డాక్టర్ ఎం.ఎస్ .గిరి వర్మ లక్ష రూపాయలు విరాళం ఇచ్చారు. ఈ మేరకు మంగళవారం చెక్కును వెటరన్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ చంద్రశేఖర్ ద్వారా జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరింధ్ర ప్రసాద్ కు కలెక్టర్ కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమ అధికారి జి. సత్యానందం, డాక్టర్ చంద్రశేఖర్, అడ్వకేట్ రాంబాబు పాల్గొన్నారు.

యుద్ధ నౌకలను సందర్శించిన ఆదివాసీ యువత

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ:జాతీయ గిరిజన యువజన సమ్మేళనలో పాల్గొనేందుకు విచ్చేసిన ఆదివాసీ యువత మంగళవారం యుద్ధ నౌకలను సందర్శించింది. తూర్పు నౌక దళంలోని ఐఎన్ఎస్ సావిత్రి మరో యుద్ధ నౌకను ఆదివాసీ విద్యార్థులు తిలకించారు. చత్తీస్గఢ్, ఒడిశా రాష్ట్రాలకు చెందిన ఐదు జిల్లా నుంచి విచ్చేసిన ఆదివాసి యువతీ యువకులు యుద్ధ నౌకలను తిలకించి సంభ్రమాశ్చర్యాలకు గురయ్యారు. యుద్ధ నౌకల్లో ఉండే ఆయుధాలు వాటి పని పూర్తి తీరును నౌక సిబ్బంది యువతకు వివరించారు.

ఉన్నత విద్యతో ఉపాధి అవకాశాలు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్:ఉన్నత విద్యతో యువతకు అపారమైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయము సలహా మండలి సభ్యులు, జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు అన్నారు. మంగళవారం ద్వారకా నగర్ లో ఈవెన్ గ్లోబ్ నూతన సెంటర్ ను శ్రీనుబాబు ముఖ్య అతిథి గా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఈవెన్ గ్లోబ్ సెంటర్ భవిష్యత్తులో మరింతగా సేవలందించాలని ఆకాంక్షించారు. ఈవెన్ గ్లోబ్ మేనేజింగ్ డైరెక్టర్ చిక్కాల యశ్వంత్ మాట్లాడుతూ, తమ సంస్థకు ఇప్పటికే హైదరాబాద్,విజయవాడ తో పాటు విదేశాల్లో కూడా పలు బ్రాంచ్ లు ఉన్నాయన్నారు. విదేశాల్లో విద్యనభ్యసించాలని భావించిన విద్యార్థులకు ప్రవేశము, రుణం మంజూరు, వీసా ప్రాసెస్ లు ఉచితం గానే సేవలందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మిస్టర్ ఇండియా విన్నర్ మోడల్. లియాన్, తులసి కార్తీక్ పాల్గొన్నారు.

శ్మశానంలో పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి -ఎస్.రాయవరం: మండలంలో మేజరు పంచాయితీ శివారు గోకులపాడులోని శ్మశానంలో మూడు లక్షల రూపాయలతో అభివృద్ధి పనులను సర్పంచ్ కర్రి సత్యన్నారాయణ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, జిల్లా పరిషత్ నిధులు మూడు లక్షలు వెచ్చించి భవన నిర్మాణం చేపట్టామన్నారు. ఇంకా మౌలిక వసతుల కల్పనకు పంచాయితీ ద్వారా కషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ సిపి నాయకులు నాగంబోయిన శ్రీనువాసరావు, జనసేన గ్రామశాఖ అధ్యక్షులు నక్కా శ్రీనువాసు, తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలతో స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుంటాం

ప్రజాశక్తి -విశాఖకలెక్టరేట్:ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడు కోవడమే లక్ష్యంగా జరుగుతున్న పోరాటంలో భాగంగా జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ స్టీల్ ప్లాంట్ రక్షణ కోసం చేపట్టిన నిరాహార దీక్షలు మంగళవారం 1362 వ రోజు కొనసాగింది. సిఐటియు మధురవాడ జోన్ కమిటీ నాయకులు దీక్షల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఐటియుసి మధురవాడ జోన్ ప్రధాన కార్యదర్శి పి.రాజ్ కుమార్ మాట్లాడుతూ విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేట్ పరం చేయడం కోసం కేంద్రంలో బిజెపి ప్రభుత్వం చేస్తున్న కుట్రలను స్టీల్ కార్మికులు,ప్రజా సంఘాల ఐక్య వేదిక ప్రతిఘటిస్తుందన్నారు. మన రాష్ట్ర ప్రజలు స్టీల్ ప్లాంట్ ను రక్షించుకునే దానికోసం జరుగుతున్న పోరాటంలో భాగ స్వాములవుతున్నారని తెలియజేశారు. రాష్ట్రంలో అధికారం చేపట్టిన టిడిపి కూటమి ప్రభుత్వం స్టీల్ ప్లాంట్ రక్షణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ దీక్షలో డి.అప్పలరాజు, జి. చిన్నారావ్,ఎస్. శ్రీనివాసరావు, ఎం.రాజు,జె. ఆర్యులు, ఎస్. సూరప్పాడు, సన్ మూర్తి పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధికారులు

ఎంపిడిఒ కార్యాలయంలో శిక్షణ

ప్రజాశక్తి-గొలుగొండ:స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మండల స్థాయి కిశోరి వికాసంపై శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ప్రతి సచివాలయం నుండి ఐదుగురు సభ్యులతో ఒక కమిటీని ఏర్పాటు చేసి శిక్షణ ఇచ్చారు. ఈ కమిటీలో సచివాలయ మహిళా పోలీస్, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్, సచివాలయ ఏఎన్ఎం, స్కూల్ టీచర్, అంగన్వాడీ వర్కర్ ఉంటారు. వీరంతా మండలంలో అన్ని సచివాలయాల్లో కిశోరి వికాసంపై అవగాహన కల్పించడం జరుగుతుందని ఐసీడీఎస్ పీఓ శ్రీగౌరి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రామారావు, ఎంఇఒలు మూర్తి, సత్యనారాయణ, వైద్యాధికారి హరిప్రవీణ్, ధనుంజైలు, సూపర్వైజర్లు పాల్గొన్నారు.

బెల్టు షాపులు నిర్వహిస్తే చర్యలు

ప్రజాశక్తి-గొలుగొండ:మద్యం బెల్టు షాపులు నిర్వహిస్తే చర్యలు తప్పవని గొలుగొండ ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సీఐ వి.రామకృష్ణ హెచ్చరించారు. మంగళవారం మద్యం బెల్టు షాపులు నిర్వహించి పట్టుబడ్డ పాత ముద్దాయిలకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఇకపై ఎవ్వరు మద్యం బెల్టు షాపులు నిర్వహించరాదని, నిబంధనలు అతిక్రమిస్తే జైలు శిక్ష తప్పదన్నారు.

సిపిఎం జిల్లా మహాసభను జయప్రదం చేయాలి



ప్రచారం చేస్తున్న సిపిఎం కమిటీ సభ్యులు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: నర్సీపట్నంలో ఈనెల 20, 21,22 తేదీల్లో జరిగే సిపిఎం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని స్థానిక కొత్త వీధిలో సిపిఎం డివిజన్ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. స్థానిక గవరవీధి, కొత్త వీధి ప్రాంతంలో ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. ప్రజల, కార్మిక, రైతులకు అండగా నిలిచే పార్టీ సిపిఎం అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం డివిజన్ కమిటీ సభ్యులు ప్రసన్న, కె.వి సూర్యప్రభ, ఎల్ గౌరీ , సామ్రాజ్యం పాల్గొన్నారు.

అచ్యుతాపురం :నర్సీపట్నంలో ఈ నెల 20, 21, 22 తేదీలలో జరుగు భారత కమ్యూనిస్టు పార్టీ మార్కిస్ట్ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని సిపిఎం అచ్యుతాపురం మండల కన్వీనర్ ఆర్ రాము, సీనియర్ నాయకులు కే రామ సదాశివరావు పిలుపునిచ్చారు. అచ్యుతాపురంలో మంగళవారం మహాసభల గోడపత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ మహాసభలో ఫార్మా, ఎస్ఈజడ్, ఎన్ఏఓబి తదితర కార్మికుల సమస్యలపై చర్చ జరుగుతుందని తెలిపారు. పరిశ్రమలలో స్థానికులకు 75శాతం ఉద్యోగాలు ఇవ్వాలని, మూసివేసిన పరిశ్రమలు తెరిపించాలని, కార్మికులకు కనీస వేతనాలు రూ.26 వేలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, నిత్యవసర సరుకులు ధరలను, పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కే. సోమునాయుడు, కర్రి అప్పారావు, కే సన్యాసిరావు, మోహన్ రావు, నాయుడు, అప్పారావు, సన్నిబాబు తదితరులు పాల్గొన్నారు.

వరి కోతలు వాయిదా వేసుకోవాలి

'పొలం పిలుస్తోంది'లో అధికారులు



మాట్లాడుతున్న ఎఒ

ప్రజాశక్తి - మాడుగుల:మండలంలో గోటివాడ, వీరనారాయణం గ్రామాలలో మండల వ్యవసాయ అధికారి ఎం.వాసుదేవరావు ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్య క్రమం నిర్వహించారు. మొదటి క్షేత్ర సందర్శన చేసి అనంతరం రైతులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ,అల్పపీడన ప్రభావంతో 3 రోజుల పాటు రైతులు వరి పంట కోతలు వాయిదా వేసుకోవాలన్నారు.ఇప్పటికే కోత కోసిన వరి పనలను పొలంలో చిన్న చిన్న కుప్పలుగా లేదా కల్లాల్లో కుప్పలుగా పెట్టుకోవాలని, అవి ఎగరకుండా, పరదాలను కప్పి బరువు పెట్టుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల కార్యదర్శి దాసరి అచ్యుతరావు, రైతు సేవా కేంద్ర సిబ్బంది ఎ. శ్రీనివాసరావు, జె.రేణుక రైతులు పాల్గొన్నారు.

గొలుగొండ:గొలుగొండ మండలం సీహెచ్.నాగాపురంలో మంగళవారం మండల వ్యవసాయాధికారి కే.సుధారాణి పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు వరి కోతలను పరిశీలించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ యలమంచిలి రఘురామచంద్రరావు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

రావికమతం: వాతావరణ శాఖ సూచన మేరకు అల్పపీడనం ప్రభావంతో కోస్తా ఆంధ్ర అంతటా విస్తారంగా వర్షాలు పడే అవకాశం ఉన్నందున రైతులు వరి కోతలు వాయిదా వేసుకోవాలని మండల వ్యవసాయ అధికారిని రూప, మండల తహసీల్దారు వెంకటరమణ, ఎంపీడీవో వెంకన్న బాబులు కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఈ నెల 13 దాటే వరకు వరి పంట కోతలు కోయరాదన్నారు. ఒకవేళ కోసిన పంట ఉంటే వెంటనే రైతులు చిన్న ,చిన్న కుప్పలుగా పెట్టుకోవాలని సూచించారు. గ్రామస్థాయిలో వీఆర్వో, పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లరాదన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి-గొలుగొండ:కౌశల్ సైన్స్ ప్రతిభ పోటీలు-2024 రాష్ట్ర స్థాయి పోటీలకు గొలుగొండ మండలం జోగంపేట జెడ్పీ ఉన్నత పాఠశాల నుండి విద్యార్థులు ఆర్.రేష్మా, పి.స్వాతి, వి.కిరణ్ కుమార్ ఎంపికయ్యారని స్కూలు కోఆర్డినేటర్ ఎం.బాను చందర్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఎంపికైన విద్యార్థులను ఇంచార్జి హెచ్.ఎం బి.సుబ్బారావు, ఉపాధ్యాయులు అభినందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ఈనె ల 6న జిల్లా స్థాయిలో జరిగిన కౌశల్ వివిధ ప్రతిభ పోటీల్లో విద్యార్థులు రాణించారని, అలాగే నెల 29,30 తేదీల్లో విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలో కూడా ప్రతిభ కనబర్చాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎంపీ శ్రీనివాసరావు, ఆర్.శ్రీనివాసరావు, బి.అప్పారావు, జి.రవీంద్రబాబు, వి.అంబిక, బి.లోవరాజు, ఎన్.చిరంజీవి పాల్గొన్నారు.



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు